ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -335 పేజీలు - 08 వెల - 04/- గురువారం 30 అక్టోబర్ 2025



## రఫేల్ యుద్ధ విమానంలో
# రాష్ట్రపతి విహారం

అంబాలా ఎయిర్‌బేస్‌లో గగన విహారం

హర్యానాలోని అంబాలా ఎయిర్‌బేస్‌లో ప్రత్యేక సార్టీ

పైలట్ యూనిఫాంలో గగన విహారం చేసిన భారత ప్రథమ పౌరురాలు

వాయుసేన సామర్థ్యాలపై విశ్వాసాన్ని చాటిన రాష్ట్రపతి

'ఆపరేషన్ సిందూర్'లో రఫేల్ జెట్ల కీలక పాత్ర

గతంలో సుఖోయ్-30 విమానంలోనూ ప్రయాణించిన ముర్ము

**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. హర్యానాలోని అంబాలా వాయుసేన స్థావరం నుంచి ఆమె ఈ ప్రత్యేక సార్టీలో పాల్గొన్నారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో కీలక పాత్ర పోషించిన రఫేల్ జెట్‌లో రాష్ట్రపతి ప్రయాణించడం

మిగతా 2లో.





# పెనువిపత్తును మిగిల్చిన మొంథా

ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితిని సమీక్షించిన సీఎం

## పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి

రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగింది

ఆస్తి నష్టం చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం

నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకుంటాం

సత్వర నివేదికలు సిద్ధం చేసి కేంద్రానికి పంపిస్తాం

పునరావాస కేంద్రంలో ప్రజలను పరామర్శించిన చంద్రబాబు

కొనసీమ,**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి**

మొంథా తుపాను పెనువిపత్తని.. రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం రోడ్డుమార్గంలో వెళ్లి అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, తుపాను బాధితులను పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, పరిహారం అందించారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ..మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. గతంలో తుపానుల సమయంలో పనిచేసిన అనుభవం నాకు ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం లేకుండా చూశాం.

మిగతా 2లో.



## విద్యుత్ పునరుద్ధరణ పనులు
# వేగవంతం

'మొంథా' తుపానుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష.. కీలక ఆదేశాలు



ప్రభావిత జిల్లాల కలెక్టర్ల నుంచి వివరాల సేకరణ

విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశం

పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి వసతి, ఆహారం కొనసాగించాలని సూచన

నదుల ఉధ్ధృతిపై ప్రజలను అప్రమత్తం చేయాలన్న పవన్

వర్షాల తర్వాత పారిశుద్ధ్యం, తాగునీటిపై దృష్టి పెట్టాలని ఆదేశాలు

అమరావతి,**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి**

మొంథా తుపాను ఏపీని వణికిస్తోంది. తుపాను తీరం దాటినప్పటికీ, దాని ప్రభావంతో పలు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రజలకు అండగా నిలవాలని కీలక ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో.

## త్వరలోనే భారత్-అమెరికా
# వాణిజ్య ఒప్పందం

ఒప్పందంపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

నెలల తరబడి చర్చలకు తెరపడనున్న వైనం

ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించిన ట్రంప్



2లో.



2లో.

# పీపీపీ ఆపలేం

అది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం

చట్టవిరుద్ధమైతే తప్ప జోక్యం చేసుకోలేం

పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించిన ధర్మాసనం



## గత ప్రభుత్వంలో
# అశాస్త్రీయంగా జిల్లాల విభజన

రాజకీయ లబ్ది కోసం జిల్లాల ఏర్పాటుపరిపాలనకు అనుగుణంగా మార్పులు,చేర్పులు

వివరాలు వెల్లడించిన మంత్రులు అనగాని, నారాయణ,నాదెండ్ల

అమరావతి,**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి**

గత వైసీపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాలని పునర్విభజించిదని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శలు చేశారు. జగన్ హయాంలో రాజకీయంగా లబ్ది పొందేందుకు జిల్లాలు పునర్విభజించిదని ఆరోపించారు.

మిగతా 2లో.

# వర్ష బీభత్సం

## తెలంగాణలో ఎనిమిది జిల్లాల్లో రెడ్ అలర్ట్



జనజీవనం అస్తవ్యస్తం

పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం

బోరుమంటున్న అన్నదాతలు

రాష్ట్రాన్ని వణికించిన 'మొంథా' తుపాన్

తెగిన చెరువులు, జలమయమైన రోడ్లు

నిలిచిన రైళ్లు-ప్రయాణికుల గగ్గోలు

నీట మునిగిన వరంగల్ రైల్వే స్టేషన్

పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్, నేడు స్కూళ్లకు సెలవు

హైదరాబాద్,**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి**

మొంథా తుపాన్ తెలుగు రాష్ట్రాలను వణికించింది. జనజీవనాన్ని స్తంభింపచేసింది. భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. పంటలు నీట మునిగాయి. పత్తిరైతులు బోరుమన్నారు. వరి పంట నీటమునిగి నేలకొరిగింది. కాంటా కోసం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం నీటిపాలైంది. రైతులు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని కాపాడుకొనేందుకు శాయశక్తులా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. టార్పాలిన్ల కొరత స్పష్టంగా కనిపించింది.

మిగతా 2లో.

## మొంథా ను బలహీనపరిచిన
# 'విండ్ షీర్'..

## ఊపిరి పీల్చుకున్న కోస్తా

నరసాపురం వద్ద తీరం దాటిన మొంథా తుపాను

'విండ్ షీర్' కారణంగా తుపాను శక్తి కోల్పోయిందని వెల్లడి

అంచనాల కన్నా తక్కువ ప్రభావంతో ముగిసిన గండం

ఊపిరి పీల్చుకున్న తీర ప్రాంత ప్రజలు, అధికారులు

తుపాను కారణంగా నిలిచిపోయిన వాయు, రైలు రవాణా

అమరావతి,**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి**

మూడు రోజులుగా తీర ప్రాంత ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేసిన మొంథా తుపాను, చివరికి ప్రశాంతంగా తీరం దాటింది. నరసాపురం సమీపంలో అర్ధరాత్రి గం. 1:00 సమయంలో తీరాన్ని తాకినప్పటికీ, అంచనా వేసిన స్థాయిలో విధ్వంసం జరగకపోవడంతో ప్రజలు, అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు.

మిగతా 2లో.



# అజహరుద్దీన్‌కు మంత్రి పదవి

ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్

ఇప్పటికే ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటన

రాజ్‌భవన్‌లో శుక్రవారం ప్రమాణ స్వీకారం?



2లో.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## రఫేల్ యుద్ధ విమానంలో రాష్ట్రపతి విహారం

(మొదటి పేజి తరువాయి)

ప్రాధాన్యత సంతరించుకుంది. భారత వాయుసేన కు చెందిన యుద్ధ విమానంలో ఆమె ప్రయాణించడం ఇది రెండోసారి.ఈ సార్టీకి ముందు రాష్ట్రపతి ముర్ము గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్ యూనిఫాం, హెల్మెట్ ధరించి విమానం ఎక్కేందుకు సిద్ధమయ్యారు. విమానం టేకాఫ్ అయ్యే ముందు ఆమె అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పి. సింగ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. త్రివిధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలిగా ఉన్న ద్రౌపది ముర్ము, గతంలో 2023 ఏప్రిల్ 8న అసోంలోని తేజ్‌పూర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో సుఖోయ్–30 ఎంకేఐ యుద్ధ విమానంలో ప్రయాణించారు. ఈ ఘనత సాధించిన మూడో రాష్ట్రపతిగా, రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె నిలిచారు. ఇంతకుముందు మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలాం (2006), ప్రతిభా పాటిల్ (2009) కూడా సుఖోయ్–30 విమానాల్లో ప్రయాణించారు.

ఫ్రాన్స్‌కు చెందిన డసో ఏవియేషన్ సంస్థ తయారు చేసిన రఫేల్ యుద్ధ విమానాలను 2020 సెప్టెంబర్‌లో అంబాలా వైమానిక స్థావరంలో అధికారికంగా వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. 2020 జులైలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన తొలి ఐదు విమానాలను 17వ స్క్వాడ్రన్ 'గోల్డెన్ యారోస్'లో చేర్చారు. సుమారు 22 ఏళ్ల తర్వాత భారత వాయుసేనలోకి దిగుమతి చేసుకున్న తొలి యుద్ధ విమానం రఫేల్ కావడం విశేషం.

## విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం

(మొదటి పేజి తరువాయి)

తుపాను పరిస్థితులపై పవన్ తన కార్యాలయ అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో ఉప ముఖ్యమంత్రి పేషీ అధికారులు మాట్లాడారు. ఈదురు గాలులు, కుండపోత వర్షాల కారణంగా జరిగిన నష్టంపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనేక ప్రాంతాల్లో చెట్లు కూలిపోయి విద్యుత్ తీగలపై పడటం, స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్, విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. తుపాను బలహీనపడినా భారీ వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలను సురక్షిత ప్రాంతాల్లోనే ఉంచాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారిని ఈ రోజు కూడా అక్కడే ఉంచి, వారికి ఆహారం, వసతి కల్పించాలని స్పష్టం చేశారు.ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ, నెల్లూరు జిల్లాలో పెన్నా నదితో పాటు పలు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ఆయా ప్రాంతాల్లో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని పవన్ సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి సారించాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## అజహరుద్దీన్‌కు మంత్రి పదవి

హైదరాబాద్,**అక్టోబర్, 29ఆంధ్ర ప్రగతి**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రివర్గంలో మైనార్టీలకు ప్రాతినిధ్యం కల్పించాలనే నిర్ణయానికి ఏఐసీసీ గ్రీన్ సిగల్ ఇచ్చింది. హైదరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత, ప్రముఖ క్రికెటర్ అజహరుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్టు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆయన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం.ఆ నివేదిక క్లియర్ అయినా, కాకపోయి నా ఆయన మంత్రి పదవి చేపట్టవచ్చు. కాకపోతే ఆరు నెలల్లో ఎమ్మెల్సీగానో, ఎమ్మెల్యేగానో ఎన్నికై ఉండాలి. లేకపోతే ఆయన మంత్రి పదవి కోల్పోతారు. ఈ పరిస్థితులు ఎలా ఉన్నా అజహరు ద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీగా ఉన్న మైనార్టీల ఓట్లు గంపగుత్తగా రాబట్టేందుకు వీలుగా అజహరుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టాలనేది హస్తం పార్టీ వ్యూహంగా కనిపిస్తున్నది. మంత్రి వర్గ విస్తరణపై కొన్ని రోజులుగా ఏఐసీసీ కసరత్తు చేసింది. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలిసింది. మరో రెండు మంత్రిపదవులు ఎప్పుడు భర్తీ చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. అజహరుద్దీన్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.అయినా తాజాగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయన సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. ప్రస్తుత రాష్ట్ర మంత్రివర్గంలో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అందులో మొదటిసారి ముఖ్యమంత్రితోపాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో ఆ పార్టీ అధిష్టానం ముస్లిం మైనార్టీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కకపోతే త్వరలో ఖాళీ కానున్న ఎమ్మెల్సీ స్థానంలో ఒకటి ఆయనకు కేటాయిస్తున్నారని తెలిసింది. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగుతున్నట్టు తెలుస్తుంది.

## పీపీపీ ఆపలేం

### అది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం

**చట్టవిరుద్ధమైతే తప్ప జోక్యం చేసుకోలేం**

**పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించిన ధర్మాసనం**

అమరావతి,,**అక్టోబర్, 29,ఆంధ్ర ప్రగతి** రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా ఉండే ఆసుపత్రులపై పీపీపీ విధానంలో థర్డ్ పార్టీకి హక్కులు కల్పించకుండా అడ్డుకోవాలన్న పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయలేమని తేల్చిచెప్పింది. పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్(పీపీపీ)తో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేసింది. ఒకవేళ ఆ నిర్ణయం పూర్తిగా చట్టవిరుద్ధమైతే తప్ప కోర్టులు జోక్యం చేసుకోలేవని పేర్కొంది. కాలేజీలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో చేపట్టాలని ఎందుకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది?. దీని వల్ల లాభనష్టాలు ఏంటి?. అన్ని అంశాలను లోతుగా పరిశీలించాల్సి ఉందని తెలిపింది. "పీపీపీ ప్రక్రియ ప్రస్తుతం టెండర్ల దశలోనే ఉంది. ప్రభుత్వం ఆహ్వానించిన వెంటనే డబ్బుల సంచులతో పెట్టబడిదారులు హడావుడిగా రారుకదా!" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తరువాత అన్ని అంశాలను పరిశీలిస్తామని పేర్కొంది. కౌంటర్ వేసేందుకు సమయం ఇస్తూ తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

## త్వరలోనే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

### ఒప్పందంపై డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

భారత్, అమెరికా మధ్య చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై త్వరలోనే సంతకాలు జరగనున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం స్పష్టం చేశారు. తన ఆసియా పర్యటనలో చివరిగా దక్షిణ కొరియాలో ఉన్న ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ తాజా ప్రకటనతో ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఒప్పందం ఖరారవడం ఇక లాంఛనమేనని తెలుస్తోంది.కొన్ని నెలలుగా ఈ ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం, ఇరు దేశాల మధ్య టారిఫ్‌లకు సంబంధించిన వివాదాల కారణంగా ఈ చర్చలు ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ.. "నేను భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాను. ప్రధాని నరేంద్ర మోదీ అంటే నాకు ఎంతో గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా మధ్య గొప్ప సంబంధం ఉంది" అని పేర్కొన్నారు.

భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవడానికి అంగీకరించడంతో, భారత వస్తువులపై విధిస్తున్న 50 శాతం టారిఫ్‌ను 16 శాతానికి తగ్గించడానికి అమెరికా ఒప్పుకున్నట్లు గతవారం వార్తలు వచ్చాయి. ట్రంప్, మోదీ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ తర్వాత ఈ పురోగతి సాధ్యమైనట్లు సమాచారం. ఈ ఒప్పందంలో భాగంగా జన్యుమార్పిడి చేయని అమెరికన్ మొక్కజొన్న, సోయామీల్ దిగుమతులను పెంచేందుకు భారత్ అంగీకరించే అవకాశం ఉంది.

## మొంథా ను బలహీనపరిచిన'విండ్ షీర్'..

(మొదటి పేజి తరువాయి)

పెను ప్రమాదం తప్పిందని భావిస్తున్నా, తుపాను కారణంగా వాయు, రైలు రవాణా సేవలు స్తంభించాయి.

**ఎలా బలహీనపడింది?**

వాస్తవానికి సముద్రంలో తీవ్ర తుపానుగా ఉన్నప్పుడు ఇది 2023లో వచ్చిన మిచాంగ్ తుపానును తలపించింది. తీరం దాటే సమయంలో గంటకు 110 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే, తీరానికి 70–100 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడు 'విండ్ షీర్' (గాలుల కోత) ప్రభావానికి గురైంది. ఇది తుపాను కన్ను (సైక్లోన్ ఐ) భాగాన్ని దెబ్బతీయడంతో, గాలులు చెల్లాచెదురై తుపాను తన శక్తిని కోల్పోయింది. దీంతో తీరం దాటే సమయానికి గంటకు 70–80 కి.మీ. వేగంతో గాలులు వీచి, మోస్తరు వర్షాలకే పరిమితమైంది.

**తీరం చేరకముందు కోనసీమలో అలజడి**

తీరం దాటకముందు మొంథా తన ప్రభావాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాపై చూపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బలమైన ఈదురు గాలులకు అనేక కొబ్బరి చెట్లు, భారీ వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సముద్రపు అలలు మూడు మీటర్ల ఎత్తున ఎగసిపడి, దాదాపు 300 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకురావడంతో తీర ప్రాంతం కోతకు గురైంది. అయితే, రాత్రి 8 గంటల తర్వాత వాతావరణం అనూహ్యంగా మారిపోయింది. ప్రచండ గాలులు నిలిచిపోయి, భారీ వర్షం తగ్గుముఖం పట్టింది. మొత్తంమీద, భారీ విధ్వంసం సృష్టిస్తుందని భావించిన మొంథా తుపాను, స్వల్ప ప్రభావంతో గట్టెక్కింది.

## గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన

(మొదటి పేజి తరువాయి)

ఎన్నికల ప్రచారంలో పరిపాలన సౌలభ్యం ఉండేలా తాము చర్యలు తీసుకున్నామని చెప్పుకొచ్చారు. పరిపాలన సక్రమంగా జరిగేలా జిల్లాలు పునర్విభజనలో మార్పులు, చేర్పులు చేశామని స్పష్టం చేశారు. సోమవారం లేదా మంగళవారం మరోసారి సమావేశమై తుది నివేదిక సిద్ధం చేసి సీఎం చంద్రబాబుకి ఇస్తామని పేర్కొన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణపైరాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ బుధవారం సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. సీఎం చంద్రబాబుతో మంగళవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సీఎం చంద్రబాబు ఇచ్చిన సూచనలపై అధికారులతో మంత్రులు చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై ఈ సమావేశంలో చర్చించామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. జిల్లాల విభజనతో ఉన్న ఇబ్బందులను పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని నెరవేర్చే విధంగా ఇచ్చిన నివేదికపై సీఎం చంద్రబాబు కొన్ని మార్గదర్శకాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. వాటితోపాటు కమిటీలో ఉన్న మంత్రులు ఇచ్చిన సూచనలను కూడా కూలంకుషంగా చర్చించామని పేర్కొన్నారు. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజక వర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని నిర్ణయించామని అన్నారు. మరోసారి ఈ విషయంపై సమావేశమై నివేదికను రూపొందించి సీఎంకు అందజేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

అమరావతి రైతులకు ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్లపై కొందరూ అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ ఫైర్ అయ్యారు. సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదోవ పట్టించేలా పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల పక్రియ దాదాపు తుది దశకు చేరుకుందని వివరించారు. ల్యాండ్ పూలింగ్ కింద 30,635 మంది రైతులకు 34,911.23 ఎకరాలు కేటాయించాల్సి ఉందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకూ 2,727 మంది రైతులకు 3,188 ఎకరాల్లో ఎ÷–లాట్‌ల కేటాయింపు పూర్తయిందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఇంకా 991 మంది రైతులకు 719 ఎకరాలు మాత్రమే ప్లాట్‌లు కేటాయించాల్సి ఉందని తెలిపారు. రిటర్నబుల్ ఎ÷–లాట్‌లలో ఇంకా 2501 మందికి 8441 ఎ÷–లాట్‌లు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందని వివరించారు. వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రైతులతో మాట్లాడి పెండింగ్ రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే నాలుగు నెలల్లో ఎ÷–లాట్‌ల కేటాయింపు, రిజిస్ట్రేషన్‌లు మొత్తం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలతో 484 మంది రైతులకు 3.15 కోట్ల కౌలు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. రైతులకు అవాస్తవాలు చెప్పి గందరగోళానికి గురి చేయొద్దని కోరారు మంత్రి నారాయణ. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే జిల్లాల పునర్వ్యవస్థీకరణ నివేదిక ఇస్తామని పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఈ సమయాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని అధ్యయనం చేసి నివేదిక ఇస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## తెలంగాణలో ఎనిమిది జిల్లాల్లో రెడ్ అలర్ట్

(మొదటి పేజి తరువాయి)

అన్నదాత ఆక్రందనలు గుండెల్ని పిండేశాయి. పలుచోట్ల భారీ వర్షాలతో రైల్వే ట్రాక్‌ల మీదినుంచి వరద నీళ్లు ప్రవహించడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. వరంగల్ రైల్వే స్టేషన్ నీట మునిగింది. కొన్ని చోట్ల రహదారులు కొట్టుకుపోయాయి. వాతావరణ శాఖ తెలంగాణలో ఎనిమిది జిల్లాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆ అంచనాలను మించి రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి.

రాజధాని హైదరాబాద్‌లో రోడ్లు చెరువుల్ని తలపించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వందల వాహనాలు ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకున్నాయి. రాయదుర్గంలో అరకిలోమీటరు దూరం దాటడానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టిందంటే ట్రాఫిక్ తీవ్రత తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. వరుణడి దెబ్బకు ప్రభుత్వం పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించింది. పాలేరు రిజర్వాయర్ అన్ని గేట్లూ ఎత్తేశారు. నిమ్మవాగు వంతెనపై వరదలో డీసీఎం కొట్టుకుపోయింది. డ్రైవర్ గల్లంతయ్యాడు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొమ్మేపల్లిలో గిరిజన బాలుర గురుకుల పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తడంతో మూసీకి వరద పోటెత్తింది. మొంథా తుఫాను తీరం దాటింది. వెళ్తూ వెళ్తూ రాష్ట్రంలో భీభత్సాన్ని సృష్టించింది. భారీ వర్షాలతో ప్రజలు అనేక అవస్థలు పడ్డారు. రైతులు పంటలు నష్టపోయి బోరుమంటున్నారు. రోడ్లు కొట్టుకుపోయి ప్రజా రవాణాకు ఆటంకం ఏర్పడింది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం రాష్ట్రంలో 8 జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్డుపై చేరింది. రఘునాథపాలెం మండలం పాపటపల్లి నుండి వీఆర్ బంజార మార్గంలోని బుగ్గవాగు వరద నీరు ప్రవహిస్తుండటంలో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. చింతకాని మండలం నాగులవంచ %–% పాతర్లపాడు మార్గంలో వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిపివేశారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యాసంస్థలకు గురువారం సెలవు ప్రకటించారు. కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ అన్ని గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వైరా రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 18.3 అడుగులు కాగా.. 19.5 అడుగులకు చేరింది. ఖమ్మం వద్ద మున్నేరు వాగు 22 అడుగులకు చేరింది. ఏన్కూరు నుంచి పల్లిపాడు వైపు వెళ్లేందుకు ఓ డీసీఎం వ్యాన్ వంతెనపై వస్తుండగా వరద ఉధృతికి వాగులోకి కొట్టుకుపోయింది. డ్రైవర్ గల్లంతయ్యాడు. డ్రైవర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మోతే నగర్, బొక్కల గడ్డ, ప్రాంతాల్లోని వరద బాధితులను పునరావాస కేంద్రాలకు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సురక్షితంగా తరలించారు.

**వరంగల్, హన్మకొండ, జనగామకు రెడ్ అలర్ట్**

'మొంథా' తుపాను ఉమ్మడి వరంగల్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించింది. జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మహబూబాబాద్ జిల్లాలో డోర్నకల్ జంక్షన్‌లో పట్టాలపైకి వరద నీరు చేరడంతో గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం నిలిపివేశారు. మమబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, తాడ్లపూసపల్లిలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి.

## పెనువిపత్తును మిగిల్చిన మొంథా

(మొదటి పేజి తరువాయి)

ఆస్తి నష్టం కూడా చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం నమోదైంది. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం. కౌలు రైతులకు పరిహారం అందిస్తాం. మత్స్యకారులు, చేనేత కార్మికులకు అదనంగా 50 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నాం అని సీఎం తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం వల్ల ఏపీలో పలు జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తుఫాను కారణంగా చేతికి అందివచ్చిన పంట పాడైపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మొంథా తుఫాను వల్ల జరిగిన ప్రాథమిక నష్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే రెండు రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో శరవేగంగా అధికారులు పంట నష్టంపై వివరాలు తెలుసుకుంటున్నారు. అయితే, ప్రాథమిక అంచనాలు వచ్చాక కేంద్ర
ప్రభుత్వానికి నివేదించనుంది ఏపీ ప్రభుత్వం. 249



మండలాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాను ప్రభావం ఉందని అధికారులు గుర్తించారు. మొంథా తుఫానుతో ఏపీలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని అధికారులు తెలిపారు. మొంథా తుఫానుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పంట నష్టంపై అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు. జిల్లాలో పంటలు భారీగా దెబ్బతిన్నాయని చెప్పుకొచ్చారు. 10 వేల హెక్టార్లలో వరిపంట దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. 5 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం కలిగినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, రెండు వేల ఎకరాల్లో రొయ్యల చెరువులు నీట మునిగాయని అధికారులు తెలిపారు.

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బాధితుల కోసం ప్రోటోకాల్‌ను పక్కనపెట్టారు. సీఎం కాన్వాయ్ వెహికల్‌లో కాకుండా ఇన్నోవా కారులోనే బాధితుల వద్దకు వెళ్లారు. సాధారణ వాహనంలోనే బాధితుల దగ్గరకు వెళ్లారు. అల్లవరం మండలంలోని ఓడరేవుల సమీపంలో ఉన్న పునరావాస శిబిరాన్ని ముఖ్యమంత్రి సందర్శించారు. పునరావాస బాధితులకు 25 కేజీల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. దాదాపు అరగంట సేపు పునరావాస శిబిరంలోనే గడిపారు. పునరావాస శిబిరంలో వసతుల కల్పనపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. అరగట్ల పాలెం, బెండమూరు లంక గ్రామాల్లో నీట మునిగిన పొలాలను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రైతులను కలిసి మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, గుర్రపు డెక్క సమస్య ఉందని, వాటిని క్లియర్ చేయాలని రైతులు ముఖ్యమంత్రిని కోరారు. రైతులు చెప్పిన విధంగా డ్రైన్లను క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన
# మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 29:** మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల పరిస్థితిని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కుందు నది పరివాహక ప్రాంతం (నందమూరి నగర్ వైపు రోడ్), వైయస్సార్ నగర్, పెద్దకొట్టాల, శ్యాం నగర్ చామకాలువ, శ్రమదానం బ్రిడ్జి, ఎస్బిఐ కాలనీ (రామకృష్ణ పిజి కాలేజ్ సమీపం) వంటి ప్రాంతాల్లో పర్యటించి వరద నీటి ప్రవాహం, కాలువల సామర్థ్యం, మరియు నివారణ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి, కలెక్టర్ ల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమన్నారు. ప్రస్తుతం కుందు నది పరివాహక ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అనవసరంగా సంచరించరాదని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేసారు.



### జిల్లాలో తుఫాను పరిస్థితిపై కలెక్టర్ వివరణ

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ మొంథా తుఫాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుండి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయన్నారు. జిల్లాలో సగటు వర్షపాతం 10 సెంటీమీటర్లు కాగా శ్రీశైలం మండలంలో 26 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో 10 సెంటీమీటర్లకు మించిన వర్షపాతం నమోదైన మండలాలు మొత్తం 10 ఉన్నాయన్నారు. ముఖ్యంగా నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు నియోజకవర్గాలు ఈ భారీ వర్షాలకు ఎక్కువగా ప్రభావితమయ్యాయని కలెక్టర్ తెలిపారు. వెలుగోడు రిజర్వాయర్‌కు సరైన పరిపుష్టి లేకపోవడంతో దిగువకు సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల కుందు నదిలో ప్రవాహం పెరిగిందన్నారు. అయితే నీటిని నియంత్రణలో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. నంద్యాల అర్బన్ ప్రాంతంలో మొత్తం ఆరు లోతట్టు ప్రాంతాలు ఉన్నాయని, వాటిలో సుమారు 1,400 కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. ఎవరి ఇళ్లలోకి నీరు చేరిందో వారిని సమీపంలోని పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్ల పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజనం, వసతి వంటి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల సహకారంతో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి పంపిస్తున్నామని వివరించారు. అలాగే పంట నష్టం మరియు ఇతర నష్టాల అంచనా వేయడం జరుగుతోందని, గురువారం సాయంత్రం నాటికి పంట పొలాల్లోని నీరు తగ్గిన తర్వాత స్పష్టమైన వివరాలు లభించే



అవకాశం ఉందన్నారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మొంథా తుఫాను కారణంగా ప్రతి జిల్లాలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని, స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎదురయ్యే ఏ సమస్యలనైనా ప్రభుత్వానికి వెంటనే నివేదించడం జరుగుతోందని, ముఖ్యంగా మొక్కజొన్న, వరి, మిరప, ఉల్లి, పూల వంటి పంటలు వేసిన రైతులకు ప్రభుత్వం నుండి తగిన సహాయం అందించబడుతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాల కారణంగా నల్లమల్ల ప్రాంతంలో కురిసిన వర్షాలు 21 వాగుల్లో ప్రవహించి కుందు నదిలో కలిశాయని తెలిపారు. దాంతో బండి ఆత్మకూరు మండలం నారాయణపురం, ఆత్మకూరు మండలంలోని భవనాసి వాగు పొంగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు, బండి ఆత్మకూరు మండలాలు, మహానంది మండలం నందిపల్లి, నంద్యాల అర్బన్ ప్రాంతాల్లో మొత్తం ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్ష సూచన ప్రస్తుతం లేకపోవడంతో ఉప్పొంగిన వాగులు, రోడ్లమీద ప్రవహిస్తున్న నీరు తగ్గే అవకాశం ఉందన్నారు. శ్రీశైలం, ఆత్మకూరు ప్రాంతాల్లో మాత్రమే వర్ష సూచన ఉన్నదని, మిగతా ప్రాంతాల్లో





తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 31వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నంద్యాల ఆర్డిఓ విశ్వనాథ్ ఇతర అధికారులు వారి వెంట పాల్గొన్నారు.









## వరద ప్రభావిత పంట పొలాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆళ్లగడ్డ మండలం, రుద్రవరం మండలాల్లోని నీటమునిగిన పంట పొలాలను సందర్శించిన కలెక్టర్.**





**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ/నంద్యాల, అక్టోబర్ 29:** మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. తొలుత ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామంలో రైతు ఎం.హిమాం హుస్సేన్ సాగు చేసిన ఉల్లి పంట పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. మూడు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసానని, ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చు చేశానని, కానీ వర్షాల కారణంగా పంట ప్రారంభ దశలోనే నీరు నిలిచిపోయి తీవ్ర నష్టం కలిగిందని రైతు కలెక్టర్‌కు ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి కలెక్టర్ మొక్కజొన్న పంట పొలాలను కూడా పరిశీలించారు. రైతులు ఎకరాకు సుమారు 50 వేల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, ధాన్యం కోత అనంతరం వర్షాల వల్ల పంట నష్టపోయిందని వివరించారు. ప్రభుత్వం నుండి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో రసూల్ బీ అనే రైతు సాగు చేసిన బొప్పాయి పంట పొలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దాదాపు 248 ఎకరాల్లో మూడు నుంచి నాలుగు నెలల వయసున్న బొప్పాయి చెట్లు నీటిలో మునిగి ఆకులు ఎండిపోయి, వేర్లు కుళ్లిపోయి పంట దెబ్బతిన్నట్లు రైతులు వివరించారు. మొత్తం 248 ఎకరాల్లో వేసిన పంటలో సుమారు 80 శాతం వరకు నష్టం జరిగిందని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను కారణంగా సంభవించిన పంట నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు పంట సంరక్షణలో మెలకువగా ఉండాలని, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఆళ్లగడ్డ నుండి రుద్రవరం వరకు సర్వీస్ రోడ్డుపై రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న పంటలకు వర్షాల కారణంగా ఫంగస్ పట్టి వ్యాపారులు కొనడంలేదని రైతులు వివరించగా, దీనిపై కూడా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. పంట నష్ట అంచనాలను త్వరితగతిన లెక్కించాలనీ, సంబంధిత వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఆళ్లగడ్డ వ్యవసాయ శాఖ ఏడి విజయ శేఖర్, రుద్రవరం మరియు ఆళ్లగడ్డ మండల వ్యవసాయ అధికారులు, తహశీల్దారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## 9 వ కార్తిక మాస వనభోజన కార్యక్రమానికి మంత్రి ఫరూక్ ఆహ్వానం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:**నంద్యాల అసెంబ్లీ శ్రీ భగీరథ సగర (ఉప్పర) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 9వ తేదీ ఆదివారం బైటిపేట శ్రీ జమ్ముల పరమేశ్వరి దేవి ఆలయం నందు జరగబోయే కార్తీక మాస వనభోజన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ని శ్రీ భగీరథ సగర (ఉప్పర) సంక్షేమ సంఘం వారు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా శ్రీ భగీరథ సగర (ఉప్పర) సంఘం అధ్యక్షుడు ఉప్పరి సురేష్ కుమార్, నంద్యాల అసెంబ్లీ సగర సంగం అధ్యక్షుడు బోయిని బాలాజీ, గౌరవ అధ్యక్షుడు చిలకల చిన్నయ్య, చౌడబోయిన మణికంఠ, వఙ్ర వెంకటేశ్వర్లు, ఇమ్మడి వెంకటరమణ, గిద్దలూరు పురుషోత్తం, పాల్గొన్నారు.

## ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది.

### ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి.



**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 29:** ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రైతులకు అభయమిచ్చారు. మహానంది మండలంలోని నంది పల్లె గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పర్యటించి ప్రభుత్వం నుండి రైతులకు, తుఫాన్ వల్ల నష్టపోయిన వారందరికీ ఆర్థిక సహాయ సహకారాలు పొందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమే ధ్యేయంగా పనిచేస్తుందని అపోహలు వీడి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి నంది పల్లె గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు మహేశ్వర్ రెడ్డి, తమ్మడపల్లె గ్రామానికి చెందిన జనార్దన్ రెడ్డి వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక



## నంద్యాల పట్టణ కేంద్ర వరద ప్రభావిత ప్రాంతాలలో ఆకస్మికంగా పర్యటించిన జిల్లా ఎస్పీ.

**వరదల వలన ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం కలగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ అక్టోబర్ 29:** నంద్యాల జిల్లాలో 'మొంథా' తుఫాన్ ప్రభావం వలన జిల్లాలోని వాగులు కాలువలు నదులు పొంగి పరవహిస్తున్న నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ జిల్లా పోలీసు అధికారులను సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ నిన్నటి దినం రాత్రి నంద్యాల పట్టణ కేంద్రంలోని హరిజనవాడ, వై. జంక్షన్, ప్రధమనంది, విశ్వనగర్, సలీం నగర్, పద్మావతి నగర్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి పోలీస్ అధికారులను వరద పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని ఎలాంటి ఆస్తి ప్రాణ నష్టం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వరద వలన కలగు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని ఆదేశించడం జరిగింది.

## మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి.

**జిల్లా రెవెన్యూ అధికారి రాముునాయక్.**

**మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా చర్యలు.**

**ఆపదలో ఉన్న వారిని మానవత్వంతో ఆదుకోవాలి.**

**అడిషనల్ ఎస్పీ యోగేంద్ర బాబు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 29:**
వివిధ ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు పోలీసులతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉన్నత విద్యా, తదితర శాఖల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణ అమలుపై సంబంధిత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రామునాయక్ మాట్లాడుతూ....జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిదిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైతే మత్తు పదార్థాలు లభ్యమవుతున్నాయో ఆయా ప్రదేశాలను గుర్తించి పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని విద్యాసంస్థలు కళాశాలల్లో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు నియంత్రణపై సంపూర్ణ అవగాహన కల్పించాలని కళాశాలల యాజమాన్య కమిటీలకు సూచించారు. ముఖ్యమైన కూడళ్లలో మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణకు సంబందించి హెూర్డింగ్ లను ఏర్పాటు చేసి యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా చూడాలన్నారు. అడిషనల్ ఎస్పీ యోగేంద్ర బాబు మాట్లాడుతూ.... జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మత్తు పదార్థాల నియంత్రణకు తమ వంతు బాధ్యతగా పనిచేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి కళాశాలలో పాఠశాలలో ముఖ్యమైన కూడలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకొని తమకు తోచిన సాయం చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిస కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'మొంథా' తుఫాన్ ప్రభావంతో ఆత్మకూరు సబ్ డివిజన్ లో రాకపోకలకు అంతరాయం.

**జిల్లా ఎస్పీ ఆదేశాలతో అప్రమత్తమైన సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం.**

**జిల్లాలో వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన జిల్లా ఎస్పీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక.**

**తక్షణ పోలీసు సహాయం కొరకు 112 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయండి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ అక్టోబర్ 29:**
ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని నల్లమల్ల అడవులలో 'మొంథా' తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడం వల్ల సిద్దాపురం చెరువు నుండి ప్రవహించే అలుగు ఉధృతంగా ప్రవహించడం వలన దోర్నాల ఆత్మకూరు మధ్య వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. దోర్నాల మీదుగా విజయవాడకు వెళ్ళవలసిన వాహనాలను నంద్యాల గిద్దలూరు మీదుగా డైవర్షన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ముఖ్యంగా వర్షానికి వడ్ల రామాపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోవడంతో అక్కడ ప్రత్యామ్నాయ మార్గాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ఎస్పీ పోలీసులను ఆదేశించడం జరిగింది. ఎస్పీ సిద్దాపురం చెరువు ,వడ్ల రామాపురం , భవనాసి వాగు ఆత్మకూరు టౌన్ లో వరద ప్రభావిత ప్రాంతాలలో స్వయంగా పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించారు. వరద ఉధృతిని అంచనా వేయడం కొరకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని (డ్రోన్ లను) ఉపయోగించి స్వయంగా డ్రోన్ ను ఎగరవేసి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడం జరిగింది. అనంతరం ఎస్పీ ఆత్మకూరు పోలీస్ స్టేషన్ కు చేరుకొని విధి నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్, ఇన్స్పెక్టర్లు రాము, సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై నారాయణరెడ్డి,ఆత్మకూరు తాసిల్దార్, ఆర్డీవో, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:**
మొంథా తుఫాన్ ప్రభావంతో నంద్యాల పట్టణంలో పలు ప్రాంతాలు ముంపుకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో నంద్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి గారు బుధవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. వరద నీటితో ఇళ్లలోకి నీరు చొచ్చుకుపోవడం, వసతి మరియు ఆహార సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన ఆయన స్థానిక అధికారులతో మాట్లాడి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రత అత్యంత ముఖ్యమని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎవరూ ఆకలితో లేకుండా, ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తాత్కాలిక భోజనశాలలు ఏర్పాటు చేయడం, వసతి సదుపాయాలు కల్పించడం, అవసరమైన మందులు మరియు తాగునీటి సరఫరా నిరంతరంగా కొనసాగాలని సంబంధిత అధికారులను కోరారు. అలాగే వరద నీరు ఎక్కువైతుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంలో ఆయన ప్రజలకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వం మరియు ప్రభుత్వ యంత్రాంగం ఎల్లప్పుడూ మీతో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. "మీరు ఎటువంటి భయపడవద్దు, నేను ఎప్పుడూ మీతోనే ఉంటాను. ప్రతి ఒక్కరికీ అవసరమైన సాయం అందేలా కృషి జరుగుతోంది. అని తెలిపారు. అలాగే తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని దగ్గరుండి పర్యవేక్షించిన ఆయన, సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను సూచించారు. ప్రజల ఆవేదనలను ఆలకించి వారికి ధైర్యం నింపుతూ, ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుందూ,మద్దిలేరు వాగు వెంట రక్షణగోడ నిర్మించలేరా.?





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:**
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సి.పి.ఎం పార్టీ గా ఉదయము 7 గంటల నుండి బయటిపే,, హరిజన పేట ,వైఎస్ఆర్ నగర్ నీటిలో మునిగి ఉన్న లోతట్టు ప్రాంతాలను పరిశీలించడం జరిగింది, అలాగే ఎమ్మార్వోకు,ఆర్డీఓకు కలెక్టర్ కి ఫోన్ చేసి బాధితులకు సహాయక చర్యలు చేపట్టి వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పుల్లా నరసింహులు మాట్లాడుతూ నంద్యాల పట్టణానికి ఎప్పటికైనా వరద ముంపు ఉంది, ఇది మాకు తెలుసు అందుకే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ )సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గతంలో కుందు మద్దిలేరు వాగు శ్యామ కాలువ లకు రక్షణ కూడా నిర్మించి నంద్యాల పట్టణానికి వరద ముంపు లేకుండా చేయాలని 74 గంటల పాటు రెండుసార్లు రిలే నిరాహార దీక్ష చేయడం జరిగింది 2002 ప్రాంతంలో శ్యామకాల్వ మద్దిలేరు వాగు పొంగి నంద్యాల పట్టణాన్ని ముంచెత్తింది ఆ సమయంలో కీర్తిశేషులు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వీటికి రక్షణ గోడ నిర్మించుటకు 98 కోట్ల రూపాయలను మంజూరు చేశారు, మంజూరు చేసిన డబ్బులను ఉపయోగించుకుని ఉంటే,ఈ యొక్క రక్షణ గోడలు నిర్మించి ఉంటే నంద్యాల ప్రాంతానికి ఈ బాధలు ఉండేవి కాదు, నిధులు అన్నిటిని దారి మళ్లించి ఉపయోగించుకోలేకపోయారు, అప్పటినుండి ఇప్పటివరకు ఏ అధికార పార్టీ అయినా మద్దిలేరు వాగును,, శ్యామ కాలువను,కుందును,వర్షాకాలంలో పరిశీలించడం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పడం ఇది తప్ప ఏమి చేయలేకపోతున్నారు,కాబట్టి ప్రజలు సురక్షితంగా ఉండాలంటే ముందు మద్దిలేరు వాగు రక్షణ గోడ, శ్యామ కాలువ రక్షణ గోడ నిర్మిస్తే ప్రజలకు ఈ బాధలు ఉండవని వారు తెలియజేశారు, ఈ ఇంకిత జ్ఞానం ఏ అధికారి పార్టీ నాయకుల కైనా ఉంటే సమస్య పరిష్కరిస్తారని వారు అన్నారు అలాగే ఈరోజు వైయస్సార్ నగర్ నందమూరి నగర్ ప్రజలు వరద నీళ్లతో అనేక రకాలు ఇబ్బందులు పడుతున్నారు ఎప్పుడో కదారబాద్ నర్సింగరావు గారు నిర్మించిన కుందు బ్రిడ్జిని ఈరోజు వరకు ఉపయోగించుకుంటున్నారు,అది ఎప్పుడు కూలిపోతాదో తెలియని పరిస్థితి, కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని ఇంతవరకు ఓపెన్ చేయలేక, ఇది అధికార పార్టీకి చేతకానితనంగా ఉంది ముందు కొత్త బ్రిడ్జిని ఓపెన్ చేస్తే వైయస్సార్ నగర్,నందమూరి నగర్ ప్రజలకు రాకపోకలు సులభం అవుతాయి కాబట్టి వెంటనే వరద ముంపు ప్రాంతాలలో ప్రజలకు ఏ సౌకర్యాలు చెయ్యాలానో, అవి చేయాలని వారు సూచించారు, ఈ కార్యక్రమంలో అక్కడ ప్రాంత నాయకులు కాజా, శివ, మరియమ్మ దుర్గ,భాను,రాఘవ,వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి గుండె సంబంధిత వైద్యం కోసం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా.!



బాధితుడు చిన్నారి తల్లి జి. మల్లేశ్వరి



నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 29:** నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం ఏ కోడూరు గ్రామానికి చెందిన గజ్జెల మల్లేశ్వరి కుమారుడు 3 నెలల చిన్నారి ( భూమా యశ్వంత్ రెడ్డి ) కొద్ది రోజుల నుండి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. తప్పనిసరిగా సర్జరీ (ఆపరేషన్) చేయాలని వైద్యులు చెప్పడంతో ఆర్థిక ఇబ్బందితో బాధపడుతున్న చిన్నారి తల్లి నంద్యాల ఎంపి డాక్టర్ బైరెడ్డి శబరికి ఫోన్ కాల్ చేసి విషయం చెప్పిన వెంటనే స్పందించిన నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ఎల్ ఓ సి కోసం ఎంపీ లెటర్ ఇచ్చి విజయవాడలో సంబంధిత అధికారులతో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడి అవసరమైన రెండు లక్షల రూపాయలను (2,00,000) గుండె ఆపరేషన్ కోసం మంజూరు చేయించడం జరిగింది. తమ బాధను అర్థం చేసుకొని ఆపరేషన్ కోసం ఎల్ఓసి మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు , నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కి గజ్జెల మల్లేశ్వరి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కుల వివక్షతో ఉద్యోగుల అవమానం.

**-అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.**

**-నల్ల బ్యాడ్జీలతో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో ఉద్యోగుల సంఘం నిరసన.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 29:** చిత్తూరు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సబ్‌డివిజనల్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి కుల వివక్షతో ఉద్యోగులను అవమానించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఆ అధికారి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా యూనిట్ డిమాండ్ చేసింది. బుధవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి సంఘం జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రప్ప, కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆ అధికారి తన వద్ద పనిచేసే సబ్‌ఆర్డినేట్లు ఏ. లవ్‌కుమార్, కే. భరత్‌లను కులం పేరుతో దూషించి, మానసిక వేధింపులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. చెప్పులు బయట వదిలి లోపలికి రావాలని ఆదేశించడం అవమానమని మండిపడ్డారు. ఇలాంటి ప్రవర్తనకు అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే రవీంద్రనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉన్నతాధికారి హెూదాలో కూర్చున్న వ్యక్తి కుల వివక్ష చూపించడం సిగ్గుచేటుందని, ప్రభుత్వం విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భోజన విరామ నిరసనలు రేపటితో పాటు ఎల్లుండి కూడా వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఎదుట కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షురాలు ఆర్. విజయలక్ష్మి, నగర కోశాధికారి వెంకట చక్రధర్, సభ్యులు బుల్లెట్ భాష, నిర్మల, సుబ్బరత్నమ్మ, రషీద్, లక్ష్మణ్ నాయక్, ఆయేషా, సుమంత్, సుమన్, సుజాత, అనిత కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్ష చట్టరీత్యా నేరం.

**బేటీ బచావో - బేటీ పడావో లక్ష్య సాధనకు కృషి. -నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 29:**లింగ వివక్ష చట్ట రీత్యా నేరమణి, దేశ వ్యాప్తంగా బేటీ బచావో – బేటీ పడావో లక్ష్య సాధన కోసం కృషి జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. న్యూ ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీనడ్డా అధ్యక్షతన 31వ కేంద్ర పర్యవేక్షణ మండలి సమావేశం జరిగిందని కేంద్ర పర్యవేక్షణ మండలి సభ్యురాలు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమలు, ప్రగతిని సమీక్షించి, లింగ సమానత్వం, మహిళా రక్షణ, గర్భనిర్ధారణకు ముందు, తర్వాత లింగ వివక్ష నిర్మూలన వంటి అంశాలపై చర్చించామన్నారు. దేశవ్యాప్తంగా "బేటీ బచావో – బేటీ పడావో" లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ సమావేశం ముఖ్యమైన అడుగుగా నిలిచిందన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్సీ ఇసాక్ బాష.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29**

మొంథా తుఫాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నంద్యాల పట్టణంలో లోతట్టు ప్రాంతాలలో ఏర్పడిన పరిస్థితులపై ఎమ్మెల్సీ ఇసాక్ బాష, బుధవారం ఉదయం క్షేత్ర స్థాయిలో విస్తృత తనిఖీ చేపట్టారు. నీరు ఎక్కువగా ప్రవహిస్తున్న ప్రాంతాలైన కుందునది పరివాహక ప్రాంతం నందమూరి నగర్ పోయే రోడ్డు, వైయస్సార్ నగర్ ఏరియా లలో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి ప్రవాహం, కాలువల సామర్థ్యం, మరియు నివారణ చర్యలపై వారు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, వైసీపీ నాయకులు తమ ప్రాంతాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ కాలువలకు నీరు అధికంగా వస్తున్న నేపథ్యంలో, నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించడం జరిగింది. అనవసరంగా ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను అని తెలిపారు.

# ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటాం.

## నంద్యాల జిల్లాకలెక్టర్ రాజకుమారి.





**ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 29:** మొందా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని నంద్యాల జిల్లా కలెక్టర్ జి .రాజకుమారి పేర్కొన్నారు. మహానంది మండలంలోని నంది పల్లె గ్రామంలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులతో పాటు జిల్లాలోని వివిధ గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల నివాస ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించిన దృష్ట్యా వారి వివరాలు స్థానిక రెవెన్యూ ,పోలీస్, వ్యవసాయ శాఖ సమగ్ర, పారదర్శక విచారణ జరిపించి అర్హులైన వారందరికీ ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయ సహకారాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్తి పంట నష్టం వివరాలను స్థానిక అధికారులు నివేదిక రూపంలో వెంటనే అందజేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. త్రాగునీరు పారిశుధ్యం తదితర అంశాలపై అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తుఫాను ప్రభావంతో గ్రామాల్లో పారిశుధ్య , ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గాజులపల్లె రైల్వే స్టేషన్ లో నివసిస్తున్న చెంచు కాలనీ వాసులకు అల్పాహారం, భోజనం, దీంతోపాటు నంది పల్లె గ్రామంలో వరద ప్రభావిత ప్రాంతంలోని కాలనీవాసులకు భోజన సౌకర్యాన్ని దాతలు మరియు రెవెన్యూ సహాయ సహకారాలతో కల్పించినట్లు మండల తాసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా కేసీ కెనాల్ అభివృద్ధి ప్రాజెక్టు చైర్మన్ రామలింగారెడ్డి ఎంపీడీవో దౌలత్ మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి, నంది పల్లె గ్రామ టిడిపి నాయకుడు మహేశ్వర్ రెడ్డి ఇతర అధికార అనధికార వ్యక్తులు పాల్గొన్నారు.

# కోవెలకుంట్ల నంద్యాల రెవెన్యూ డివిజన్లో కలపండి.



**ఆంధ్ర ప్రగతి కోవెలకుంట్ల అక్టోబర్ 29:** గత ప్రభుత్వం చేసినటువంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సరిదిద్దుకునే అవకాశం మళ్లీ ఈ ప్రభుత్వంలో కలిగింది, అని బ్రిటిష్ హయాం నుండి కోవెలకుంట్ల మండలము నంద్యాల రెవిన్యూ డివిజన్ లో కొనసాగుతూ వచ్చిందని మరియు కోవెలకుంట్ల మండల ప్రజలకు సౌకర్యవంతమైనటువంటి బస్సు రైలు మార్గాలుకలిగిఉండి మండల సరిహద్దు నుండి నంద్యాల జిల్లా మరియు రెవెన్యూ కేంద్రము కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉండి విద్య ఉద్యోగ వైద్య తదితర అవసరాల కోసం కోవెలకుంట్ల మండలం నుండి వేలాదిమంది ప్రతిరోజు నంద్యాలకు ప్రయాణిస్తూ వారి వారి యొక్క రోజువారి కార్యక్రమాలను ముగించుకొని తిరిగి వస్తున్నారు ఇట్టి పరిస్థితులు ఉన్నటువంటి కోవెలకుంట్ల మండలాన్ని ఎటువంటి బస్సు మరియు రైలు సౌకర్యం లేకుండా దాదాపు 75 కిలోమీటర్ల దూరం ఉన్నటువంటి డోన్ రెవెన్యూ డివిజన్లో కలపటం ప్రజా వ్యతిరేక నిరవయంగా నాటి నుండే ఎన్నో విన్నపాలను ఆనాటి ప్రజాప్రతినిధులకు మరియు అధికారులకు అందించడం జరిగింది. ఇటువంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సరిదిద్దుకునే అవకాశం నేటి ప్రభుత్వం మరోసారి కల్పించడం స్వాగతించదగ్గ పరిణామంగా కోవెలకుంట్ల మండల ప్రజా నీకం యొక్క గొంతుకను పత్రికా ముఖంగా వినిపిస్తున్నామంటూ విలేకరుల సమావేశంలో కోవెలకుంట్ల పట్టణానికి చెందిన నాయకులు శ్రీ గడ్డం రామకృష్ణారెడ్డి,ఆమడాల మద్దిలేటి నోస్సం రమణయ్య, వై.రంగారెడ్డి, ఎస్.రామ సుబ్బారెడ్డి, బిజినవేముల సుబ్బరాయుడు తదితరులు పాల్గొని కోవెలకుంట్ల మండల ప్రజాభిప్రాయాన్ని పత్రికాముఖంగా అధికారులకు విన్నవించుకున్నారు. ఇదే సమావేశం నందు గత ప్రభుత్వం బనగానపల్లెని రెవిన్యూ డివిజన్ గా ప్రతిపాదనలను పంపించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని మరియు ప్రభుత్వం వారు ఇప్పుడు తిరిగి బనగానపల్లి రెవెన్యూ డివిజన్ గా మార్చే అవకాశాన్ని కల్పించిన అటువంటి పరిణామానికి కోవెలకుంట్ల మండల ప్రజలు స్వాగతిస్తారని పత్రికాముఖంగా కోవెలకుంట్ల పట్టణ నాయకులు చెప్పుకొచ్చారు.

# ఏపీ పత్తి రైతుకు కూటమి ప్రభుత్వం శుభవార్త.

## జనసేన పార్టీ నాయకులు దండు మురళీ కృష్ణ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:**



ఏపీ పత్తి రైతుకు శుభవార్త రేపటి నుండే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతాయని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు దండు మురళీకృష్ణ తెలిపారు. తుఫాను మూలంగా పత్తి రైతు నష్టపోకుండా ఉండేందుకు తక్షణ సేకరణ రాష్ట్ర వ్యాప్తంగా 30 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు అన్నారు. క్వింటాలుకు రూ.8,110ల కనీస మద్దతు ధర. 2025-26 సంవత్సరానికి 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగు జరిగింది. సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడిని అంచనా వేశారు. పత్తి రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను సీఎం యాప్ లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత "కపాస్ కిసాన్" యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పత్తి రైతులు నష్టపోకుండా ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలి అని నంద్యాల జిల్లా జనసేన పార్టీ తరపున తెలియజేస్తున్నాము.

# జల దిగ్బంధనం లో అనుపూరు గ్రామం.

**సుమారు 1000 ఎకరాల పంట నష్టం.**

**పంట కోతకు సిద్ధంగా ఉన్న పంట నీట మునిగి మొలక వచ్చినట్టు తెలిపిన రైతులు.**

**ప్రభుత్వం స్పంచించి రైతు లను ఆదుకోవాలి అని కోరుకుంటున్న రైతులు.**

**ఎలాంటి ప్రమాదకర సంఘటనలు జరగకుండా సర్పంచ్ , పోలీస్, మరియు రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.**





**ఆంధ్ర ప్రగతి పాణ్యం అక్టోబర్ 29:**

పాణ్యం మండలం అనుపూరు గ్రామం కుందూ నది ఒడ్డున ఉన్నటువంటి రైతుల పొలాలు మినుము మరియు మిరప పంటలు జొన్న, మొక్కజొన్న శనిగ పంటలు నీటమునిగినవి దాదాపుగా 1000 ఎకరాల పంట నష్టం జరిగినట్టు అనుపూరు గ్రామ ప్రజలు తెలిపారు అలాగే గ్రామం మొత్తం చుట్టూ నీరు చేరడం తో రాక పోకలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కె.శరభ అయ్యా ,%౦%.నాగేశ్వర్ రెడ్డి ఎల్.శివ శేషుడు, ఎల్.శీను , జి.నారాయణరెడ్డి, ఎం.జయరాముడు, ఎం. ఖాజా హుస్సేన్, ఏ.రామానుజనేయులు వీరి పంటలు జొన్న, మొక్క జొన్న,పొగాకు,మిరప,వరీ,శనిగ ,మినుము, ఇలా అన్నిరకాల పంట కోతకు సిద్ధంగా ఉన్న పంట నీట మునిగి మొలకెత్తడంతో రైతులు తీవ్ర నష్టం వాటిలిందని వాపోతున్నరు వెంటనే ప్రభుత్వం స్పందించి సహకరించవలసిందిగా రైతులు కోరుతున్నారు.

## అధిక వర్షాల వలన వరి మరియు మొక్కజొన్న

# పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

## వ్యవసాయాధికారి సుధాకర్.







**ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల అక్టోబర్ 29:**

మండలంలో గత రెండు రోజుల నుండి కురుస్తున్న మొంథి తుఫాను వలన నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ అగ్రికల్చర్ డివిజన్ పరిధిలో వివిధ పంటలపై ప్రభావం ప్రధానంగా అధిక వర్షాల వలన వరి మరియు మొక్కజొన్న పంటలలోచూపుతుందని,మండల వ్యవసాయ అధికారి సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా అధిక వర్షాల వలన వరి మరియు మొక్కజొన్న పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు కలిగే నష్టాన్ని కొంతవరకు తగ్గించేందుకు వీలవుతుందని అన్నారు. నష్టాలను తగ్గించేందుకు పలు సూచనలు, సలహాలు తెలియజేశారు.

వరి పొలాల్లోని నీటిని అంతర్గత కాలువల ద్వారా తగ్గించాలన్నారు. గింజ రంగు మారకుండా మాగుడు తెగుళ్ల నివారణకు ఎకరానికి 200 మిల్లీ లీటర్ల ప్రొపికోనజోల్ నుపిచ్చి కారి చేయాలని తెలిపారు. నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనబడితే అయిదు శాతం ఉప్పు ద్రావణం ( 50 గ్రాముల స్ఫటిక ఉప్పు ను ఒక లీటర్ నీటికి చొప్పున) పిచికారీ చేయాలి అని అన్నారు. మొక్కజొన్నకు. కోత సమయంలో మొక్కజొన్న కండెలను తొక్కలతో కోయడం వలన వర్షపు నీరు కండలపై నేరుగా తగలకుండా ఉండి గింజలు కుళ్ళిపోకుండా కాపాడ వచ్చిందని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత తడిసిన కండెలను గచ్చు లేదా టార్పలిన్ పై పల్చగా పేర్చి ఎండలో బాగా ఆరబెట్టి సాధ్యమైనంత త్వరగా నూర్పిడి చేపట్టాలన్నారు.

తడి కండెలపై టార్పాలిక్ లేదా ప్లాస్టిక్ కవర్లు కప్పకూడదు, గాలి సులభంగా తగిలే ప్రదేశంలో ఆరబెట్టాలి అని తెలిపారు. అవసరాన్ని బట్టి తడిసిన కండలపై సుమారు ఐదు శాతం మెత్తటి ఉప్పును పల్చగా చల్ల. క్రింద మీద బాగా కలపడం ద్వారా మొలక రావడం కొంత వరకు నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం వారు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం జాన్సన్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె అశోక్ కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ కె మోహన్ విష్ణువర్ధన్, డాక్టర్ ఎంశివరామ కృష్ణ వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మైనారిటీల సంక్షేమానికి నిస్వార్ధంగా కృషి చేస్తా.!

## - మనియార్ ఖలీల్, డైరెక్టర్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్.






**ఆంధ్ర ప్రగతి అమరావతి అక్టోబర్29:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఎంజీ రోడ్డులో గల మేరిడియన్ కన్వెన్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ గా మనియార్ ఖలీల్ దైవ సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఛైర్మెన్ అధ్యక్షతన నిర్వహించిన బోర్డు సమావేశానికి మనియార్ ఖలీల్ హాజరై, మైనారిటీల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మరియు భవిష్యత్తులో అవలంబించబోయే వివిధ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మనియార్ ఖలీల్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మైనారిటీలకు కనీస న్యాయం జరగలేదని కేవలం బటన్ నొక్కుతున్నామని బూటకపు ప్రచారం చేసుకొని మైనారిటీల కొరకు ఒక్క సంక్షేమ పథకం అమలు చెయ్యకుండా మోసం చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ సోదరులు జగన్ మోహన్ రెడ్డికు 11 సీట్లు ఇచ్చి సాగానంపారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ సమాజం యొక్క సంపూర్ణ మద్దతుతో అఖండ మెజారిటీతో గెలుపొందిన మొదటి సంవత్సరం నుండే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. రాష్ట్ర మైనారిటీల అభివృద్ధి, స్వావలంబన కోసం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మరిన్ని ఆర్థిక మరియు సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. బుధవారం నాడు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవాలాందించేందుకు తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, రాష్ట్ర మంత్రి ఎన్ ఎండి ఫరూక్ కి, మరియు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర మైనారిటీల సంక్షేమం కోసం అహర్నిశలు నిస్వార్థంగా కృషి చేస్తానని మనియార్ ఖలీల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మెన్ మౌలాన ముస్తాక్ అహ్మద్, బోర్డు సభ్యులు, ఎండి యాకుబ్ భాష,కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలకుల నిర్లక్ష్యమే ప్రజల కష్టాలకు కారణం

## -సిపిఎం విమర్శ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:**



నంద్యాల పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు వరదలు వచ్చిన ప్రతిసారి భయాందోళనకు గురికావడం జరుగుతుందని గతంలో సిపిఎం పార్టీగా 72 గంటల దీక్ష చేసిన అనంతరం అప్పటి ప్రజాప్రతినిధులు ప్రభుత్వం ద్వారా 100 కోట్లు విడుదల చేసిన నేటి వరకు చామకాలువ,కుందూ నది, మద్దిలేరు వాగుల వెంట రక్షణ గోడను నిర్మించకపోవడం వలన ప్రభుత్వం నిధులను వెనక్కి తీసుకోవడం జరిగిందని అప్పటి పాలకుల నిర్లక్ష్యం, నేటి పాలకుల నిర్లక్ష్యం వలన ప్రజలకు వరదలు వచ్చిన ప్రతిసారి కష్టాలు తప్పడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు,కే మహమ్మద్ గౌస్,సిపిఎం సీనియర్ నాయకులు తోట మద్దులు అన్నారు. నంద్యాల పట్టణంలో మొంతా తుఫాను ప్రభావం వలన లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయని వాటిని పరిశీలించేందుకు సిపిఎం బృందం గా వెళ్లడం జరిగిందని,బయటి పేట, వైఎస్ఆర్ నగర్,శ్యామ్ నగర్, హరిజన పేట, విశ్వ నగర్, ఎన్జీవోస్ కాలనీ,సిపిఎం ఆఫీస్ ఏరియా, మంగలి పేట, చామకాలువ చుట్టూ ఉన్న ప్రాంతాలను పర్యటించడం జరిగింది. మొంతా తుఫాను ప్రభావం భారీగా ఉందని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిన నంద్యాల పట్టణ మున్సిపల్ అధికారులు మాత్రం ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో నిర్లక్ష్యం వహించడం వలన లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురవడం జరిగిందని,లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయకపోవడం ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహించడం జరిగిందని, ఇళ్లలోకి నీరు చేరిన తర్వాత పర్యవేక్షణ చేయడం తప్ప ఏమి చేయలేకపోయారని అన్నారు. ప్రజల కష్టాలకు కారణం అధికారులు ప్రజాప్రతినిధులే అని అన్నారు. ఇప్పటికే ఇళ్లలోకి నీరు చేరి నష్టపోయిన ప్రతి కుటుంబానికి నిత్యవసర వస్తువులు,సరుకులతో పాటు పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల మేనిఫెస్టోలో చామకాలువ, కుందు నది, మద్దిలేరు వాగుల వెంట రక్షణ గోడను నిర్మిస్తామని హామీనిచ్చి గెలిచి నంద్యాల అభివృద్ధి కోసం ఏమాత్రం కృషి చేయకుండా కేవలం షాప్ ల ఓపెనింగ్ లకు, ఏ కార్యక్రమమైనా ముఖ్య అతిథిగా వెళ్లడం తప్ప నంద్యాల పట్టణంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఏమిటి వాటిని ఏ విధంగా పరిష్కారం చేయాలనే ఆలోచన మంత్రి ఫరూక్ గారు చేయడం లేదని మున్సిపల్ అధికారులతో ఇప్పటికైనా చర్చించి లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా రాబోయే కాలంలో వరద ముప్పు నుంచి నంద్యాలను కాపాడేందుకు రక్షణ గోడను నిర్మించాలని, చామకాలువ పూడికను తీయాలని లేనిపక్షంలో సిపిఎం పార్టీగా ప్రజలను కదిలించి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఇరా కార్యాలయం లో ఘనంగా లెజెండ్ శీను పుట్టినరోజు వేడుకలు







**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:** నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం దగ్గర ఉన్న పి ఏ వి కాంప్లెక్స్ నందు ఉన్న ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ కార్యాలయం లో సీనియర్ జర్నలిస్టు ఐరా నంద్యాల జిల్లా అధ్యక్షులు లెజెండ్ శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ కార్యాలయంలో పుట్టినరోజు సందర్భంగా జర్నలిస్టు మిత్రుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలవైభవంగా సీనియర్ జర్నలిస్టు మిత్రుల సమక్షంలో అంగరంగ వైభవంగా పుట్టినరోజు వేడుకలను జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పాత్రికేయులు జాషువా, జయప్రకాష్, విజయ్, శరత్, ప్రదీప్, చంద్ర, రాజశేఖర్, చోటు,బాల నాయక్, మల్లేష్,పవన్, రఘు తదితరులు పాల్గొన్నారు.









## వరద ముంపు బాధితులకు ఆహారం పంపిణీ.

### టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ శివశంకర్ యాదవ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల అక్టోబర్ 29:** మొంథా తుఫాను ప్రభావంతో అకాల వర్షాల వల్ల వరదలు సంభవించిన ప్రాంతాల్లో వరద బాధితులకు నంద్యాల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ వాకా శివ శంకర్ యాదవ్, 23వ వార్డు టిడిపి ఇన్చార్జి గుద్దేటి వెంకటేశ్వర్లు, కెసికెనల్ నీటి సంఘం అధ్యక్షుడు సగినాల తిమ్మయ్య, 21వ వార్డు టిడిపి ఇన్చార్జి జయ ప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో భోజనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాలతో టిడిపి యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ ఆధ్వర్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని విశ్వ నగర్ కంసలిపేట, సిపిఎం పార్టీ కార్యాలయ సమీపంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో టిడిపి యువ నాయకుడు ఎన్ఎండి ఫయాజ్ విస్తృతంగా పర్యటించి వరద బారిన పడ్డ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు భోజన వసతి లేదని ఆయన దృష్టికి తీసుకురావడంతో ఫయాజ్ ఆదేశాల మేరకు బాధితులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వాకా శివశంకర్, గుద్దేటి వెంకటేశ్వర్లు, సగినాల తిమ్మయ్య, జయ ప్రకాష్ నారాయణులు మాట్లాడుతూ యువ నాయకుడు ఫయాజ్ ఆదేశాలతో వరద ప్రాంతాల్లోని ప్రజలకు అన్నదానం చేశామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని తెలిపారు. వరద బాధితులకు తాము అండగా ఉంటామని మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాలతో ఈ ప్రాంతంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని తెలిపారు.

# రైతులు నష్టపోయారు..

### ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందించాలి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా అక్టోబర్ 29:** మొంథా తుఫాను ప్రభావం వల్ల నంద్యాల జిల్లా చుట్టుపక్కల ప్రాంతాలలో పంట పొలాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. రైతులు భారీ నష్టాన్ని చవిచూశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులను గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా డిమాండ్ చేసింది. నంద్యాల పరిసర ప్రాంతాలలో తుఫాను ప్రభావం వల్ల జలమయమైనా లోతట్టు ప్రాంతాలను ఎస్ డి పి ఐ జిల్లా నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్డిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజాస్ హుస్సేన్ మాట్లాడుతూ.."మొంథా తుఫాను కారణంగా పంటలు నాశనం అయ్యాయి. రైతులు చాలా వరకు నష్టపోయారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక సహాయక ప్యాకేజీని ప్రకటించి రైతులను ఆదుకోవాలి" అని తెలిపారు. ఎస్ డి పి ఐ నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు వి. హనీఫ్ మాట్లాడుతూ.. "ప్రభుత్వం రైతుల సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించాలి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస చర్యలు వేగంగా చేపట్టాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ డి పి ఐ జిల్లా కోశాధికారి సమీవుల్లా ఖాన్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి మక్బూల్ హుస్సేన్, కోశాధికారి నూరుల్లా, కమిటీ సభ్యులు అత్తర్ హుస్సేన్, రిద్వానాలం, షఫీ, మన్నాన్ తదితరులు పాల్గొన్నారు.

# వరి రైతులను నిండా ముంచేసిన తుఫాన్

### పంటపై ఆశ వదిలేసుకోవాల్సిన పరిస్థితి -ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్న రైతులు



విజయవాడ,**అక్టోబర్ 29ఆంధ్ర ప్రగతి** మొంథా' తుఫాన్ వరి రైతులను నిండా ముంచేసింది. భారీ వర్షాలకు ఈదురుగాలు తోడవడంతో పంటనష్టం మరింత పెరిగింది. బాపట్ల, వేమూరు, రేప్లలె, తెనాలి ప్రాంతాలలో వేల ఎకరాలలో వరి నేలవాలిపోయింది. కంకుల దశకు వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. వరుసగా వర్షం కురుస్తుంధంతో పంటపై రైతులు ఆశ వదిలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కళ్ల ముందే పంట నాశనం అవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్నారు. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వరి పంటలకు అపార నష్టం వాటిల్లింది. చేతికి అంది వచ్చిన సమయంలో వరి పంట నేలకొరిగింది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటలు నేలపాలు కావడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఎకరానికి 30 వేల నుండి 40 వేల రూపాయల వరకు నష్టం వాటినట్టు వాపోతున్నారు. ఎకరానికి 40 బస్తాలు వచ్చే దిగుబడి ఇప్పుడు 10 నుండి 20 బస్తాలు మాత్రమే వచ్చే పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మంథా తుఫాను ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. నదీ పరీవాహక ప్రాంతాలలో పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నాం అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ అన్నారు. పునరావాస కేంద్రాలు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలలో జాగ్రత్తలు తీసుకుంటున్నా మన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, బుడమేరు ప్రస్తుతం కంట్రోల్లో ఉందని జిల్లా కలెక్టర్ లక్ష్మీ చెప్పారు. 'మొంథా' తుఫాన్ వరి రైతులను నిండా ముంచేసింది. ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటలు నేలపాలు కావడంతో గుంటూరు జల్లా రైతులు గగ్గోలు పెడుతున్నారు. భారీ వర్షాలకు ఈదురుగాలు తోడవడంతో పంటనష్టం మరింత పెరిగింది. బాపట్ల, వేమూరు, రేప్లలె, తెనాలి ప్రాంతాలలో వేల ఎకరాలలో వరి నేలవాలిపోయింది. కంకుల దశకు వచ్చిన వరి పంట పూర్తిగా నేలకొరిగింది. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్నారు.

# ఓటర్ల జాబితా సవరణలు అవసరమే !

**అక్టోబర్ 29 ఆంధ్ర ప్రగతి**

ఓటరు నమోదు ప్రక్రియలో లోపాలను సరిచేయడంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికీ పక్కా ప్రణాళిక లు చేపట్టడం లేదు. ఆధార్ తరహాలో పర్మినెంట్ నంబర్ వచ్చేలా, మార్పులు చేర్పులు చేసుకునేలా వ్యవస్థను పటిష్టం చేయడం లేదు. సాంకేతికంగా ఇంతగా అభివృద్ధి చెందిన దశలో ఇసి సాంకేతికతను అందిపుచ్చుకోవడం లేదు. బీహార్‌ల చేపట్టిన ఓటర్ల సవరణ సర్ తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. అయితే అందులో విపక్ష కాంగ్రెస్ పార్టీ కుట్రకోణం కూడా ఉంది. ఓట్లను తొలగిస్తే ప్రజలు తిరుగుబాటు చేయాలి. తమ ఓట్లు గల్లంతు అయ్యాయని చెప్పాలి. కానీ ఎక్కడా ఇలాంటి ఆరోపణలు రాలేదు. ఒకవేళ ఒకటిరెండుచోట్ల వచ్చినా, స్థానిక అధికారులను కలిసి వారు తమ ఓటును పునరుద్ధరించుకున్నారు. పెద్ద మొత్తంలో ఓట్లు గల్లంతు అయినట్లుగా ..ఓట్ చోరీ గురించి ఆరోపణలు చేసి, అభాసుపాలయిన రాహుల్ గాంధీ ఎక్కడా ఓట్ల గల్లంతుపై ఒక్కటంటే ఒక్క అఫిడవిట్ దాఖలు చేయలేకపోయారు. సుప్రీం కూడా ఇదే సూచించింది. ఓట్లు గల్లంతయిన వివరాలను సమర్పించాలని కోరితే రాహుల్ ఇప్పటికీ ముందుకు రాలేకపోయారు. అంటే ఇందులో ప్రచారయావ తప్ప నిజాలు లేవని తెలుస్తోంది. ఈ క్రమంలో దేశంలోని మరికొన్ని రాష్ట్రాల్లో సర్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు భారత ఎన్నికల సంఘం ప్రకటించింది. దేశంలో చనిపోయిన వారి ఓట్లతో పాటు అక్రమంగా చొరబాటు ద్వారా వచ్చిన వారి ఓట్లను గుర్తించి తొలగిచాల్సిందే. ఇందులో ఎలాంటి రాజీపడాల్సిన అవసరం లేదు. మన ఓటర్ల జాబితాలో దేశ విద్రోహశక్తులు చేరి, మన ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసే చర్యలు వ్యతిరేకించాల్సిందే. రోహింగ్యాలు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వచ్చి తిష్టవేసిన వారి ఓట్లను నిర్దాక్షిణ్యంగా తొలగించాల్సిందే. ఎన్నికల పక్రియకు రెండు నెలల ముందు బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో అత్యున్నత న్యాయస్థానంలో పలు కేసులు దాఖలయ్యాయి. విచారణ చేపట్టారు. ఓట్ల తొలగింపు ఆధారాలు చూపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని విపక్షనేత రాహుల్‌కు సుప్రీం సూచించింది. అయితే దీనిపై ఆయన ఒక్క అఫిడవిట్ కూడా దాఖలు చేయలేదు. ప్రస్తుత దశలో వివిధ రాష్ట్రాల్లో 51 కోట్ల మందిపైగా ఓటర్ల వివరాలు నిగ్గుతేల్చే ఎస్ఐఆర్‌ను చేపట్టడం ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధతను చాటుకోవడంగానే చూడాలి. ఈ వ్యవహారంలో రాజకీయ పార్టీలు తప్పుదోవ పట్టించే ప్రకటనలు మానాలి. స్థానిక సంస్థలకు, రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎస్ఐఆర్ చేపట్టవద్దని కేరళ






శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించడం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదే. ఇది ఓ రకంగా ఓఎన్నికల సంఘం విధుల్లో తలదూర్చడమే అవుతుంది. ఎవరు ఓటరో కాదో తేల్చుకునే బాధ్యత ఎన్నికల సంఘానిదే. ప్రసాజ్వామ్య వ్యవస్థలో ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిచేయడం అత్యవసరం. ప్రజలు తమ ఉపాధి, విద్య, ఉద్యోగం తదితర అవసరాల కోసం అనేక ప్రాంతాలకు వెళుతుంటారు. కొంతమంది చనిపోవడం, 18 ఏళ్లు నిండినవారు కొత్తగా నమోదు కావడం కూడా జరుగుతుంది. ఈ క్రమంలో ఓటర్ల జాబితా ఆధునీకరణ పక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంగా, రాజకీయ పక్షపాత రహితంగా, అనుమానాలకు తావివ్వని విధంగా చేపట్టాల్సిందే. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతమైన ఎన్నికలు భారత రాజ్యాంగ మౌలిక వ్యవస్థకు మూలస్తంభం లాంటిది. వాటిని నిర్వహించే ఎన్నికల కమిషన్ ఈ వ్యవస్థను బలోపేతం చేస్తూ పోవాల్సిందే. అయితే శేషన్ లాంటి వారు ఎన్నికల కమిషనర్‌గా ఉన్న సమయంలో పారదర్శక ఎన్నికలకు అవకాశం ఏర్పడింది. ఆ తరవాత ఎన్నికల కమిషనర్లుగా వచ్చిన వారెవ్వరూ శేషన్ అడుగుజాడల్లో నడవలేదు. ప్రధాని, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎన్నికల కమిషనర్ల నియామకాలను చేపట్టే విధానాన్ని మోడీ ప్రభుత్వం మార్పు చేసింది. సిజెఐని తొలగించి, ఆ స్థానంలో సీనియర్ కేబినెట్ మంత్రిని సభ్యుడిగా చేర్చింది. ఈ విధానం సరికాదని, ఎన్నికల కమిషనర్ల నియామకంలో అధికార పార్టీకి అనుచితమైన అధికారం ఉండకూడదని ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పును పక్కనపెడుతూ పార్లమెంటులో చట్టం చేసింది. బీహార్ ఎస్ఐఆర్ పక్రియపై సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వనే లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో తాజాగా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టడం వల్ల కొందరికి అనుమానాలు రావచ్చు. కానీ ఓటర్ల జాబితాలను నవీకరించుకోవాలన్న సంకల్పాన్ని నిలదీయలేం. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఏవైనా అభ్యంతరాలను పక్కన పెడితే నిలదీయాలి. అర్హులైన వారి ఓట్లు గల్లంతయితే అడగాలి. అంతేగానీ ప్రక్రియను చేపట్టడాన్ని నిలదీయడం లేదా బహిష్కరించడం ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. సర్ ప్రక్రియ సక్రమంగా సాగడానికి, పారదర్శకంగా జరగడానికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు తోడ్పాటును అందించాలి.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రభ
తెలుగు దినపత్రిక
గురువారం 30 అక్టోబర్ 2025

# శ్రేయస్ ఎలాంటి సర్జరీ జరగలేదు

- బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడి



సిడ్నీ వేదికగా జరిగిన ఆసీస్ మ్యాచ్‌లో భారత ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో చేరారు. అతడి ప్లీహానికి గాయమవడంతో అంతర్గతంగా రక్తస్రావం జరిగి ఐసీయూలో చేర్చినట్లు వార్తలు వచ్చాయి. శ్రేయస్ అయ్యర్‌కు శస్త్ర చికిత్స జరిగిందని, కనీసం ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే శ్రేయస్ పరిస్థితిపై బీసీసీఐ మరోసారి స్పందించింది. శ్రేయస్ పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు పేర్కొంది. అతడు ఎలాంటి సర్జరీ చేయించుకోవడం లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. 'శ్రేయస్ అయ్యర్ పరిస్థితి బాగానే ఉంది. వైద్యులు అనుకున్న దానికంటే వేగంగా శ్రేయస్ రికవరీ అవుతున్నాడు. డాక్టర్ రిజ్వాన్‌తో నిరంతరం టచ్‌లోనే ఉన్నాం. సిడ్నీ ఆసుపత్రిలోనే భారత జట్టు వైద్యుడు కూడా ఉన్నారు. పూర్తిగా కోలుకుని రావడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని అనుకుంటున్నాం. కానీ, శ్రేయస్ తీరును చూస్తే ఇంకాస్త ముందుగానే కోలుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. వైద్యులు కూడా శ్రేయస్ పరిస్థితి మెరుగుదల బాగా ఉందని తెలిపారు. ఇప్పటికే అతడు తన రోజువారీ కార్యక్రమాలను చేసుకుంటున్నాడు. గాయం తీవ్రంగా అయి ఉండొచ్చు. కానీ ప్రమాదం నుంచి మాత్రం బయటపడ్డాడు. ఇప్పటికే ఐసీయూ నుంచి శ్రేయస్‌ను సాధారణ రూంకు మార్చారు' అని సైకియా వివరించారు. ఇక శ్రేయస్‌కు శస్త్రచికిత్స జరిగినట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయని సైకియా అన్నారు. కానీ అతడికి ఎలాంటి సర్జరీ జరగలేదని చెప్పారు. అయితే శ్రేయస్ ప్లీహంలో అంతర్గత రక్తస్రావం అయ్యిందని, దానిని ఆపేందుకు భిన్నమైన వైద్య ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. అందుకే, చాలా త్వరగా రికవరీ అవుతున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి గాయాలు ఉన్నప్పుడు కనీసం ఏడు రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని అన్నారు. వేగంగా కోలుకుంటున్నప్పటికీ శ్రేయస్ కూడా ఆసుపత్రిలోనే ఉంటాడని సైకియా స్పష్టం చేశారు.

# తొలి 3 మ్యాచ్‌లకు నితీష్ దూరం



ఇండియాకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆసియా కప్ 2025 ఫైనల్స్‌కు ముందు గాయపడిన హార్దిక్ పాండ్యా ఇప్పటికీ ఆసీస్ పర్యటనలకు అందుబాటులో లేదు. అతని స్థానంలో తెలుగు తేజం, యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని జట్టులోకి తీసుకున్నారు. కానీ గాయం కారణంగా నితీష్ రెడ్డి తొలి మూడు టీ20 మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. సిరీస్ ప్రారంభానికి ముందు భారత్‌కు ఇది మైనస్ పాయింట్ కానుంది. నితీష్ అందుబాటులో ఉంటే అటు బ్యాట్, ఇటు బంతితో జట్టుకు సేవలు అందించేవాడు. బీసీసీఐ ఒక ట్వీట్ చేసింది. "ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి మొదటి 3 టీ20లకు దూరం కానున్నాడు. అడిలైడ్‌లో జరిగిన రెండో వన్డేలో ఎడమ క్వాడ్రిస్స్ గాయం నుంచి కోలుకుంటున్న నితీష్ రెడ్డి మెడకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నాడు. వైద్య బృందం నితీష్ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. నితీష్ త్వరలోనే మ్యాచ్ లకు అందుబాటులోకి వస్తాడని" పేర్కొంది. భారత్ తప్పక గెలవాల్సిన రెండో వన్డేలో రెడ్డి 10 బంతుల్లో 8 పరుగులు మాత్రమే చేసి, 3 ఓవర్ల పాటు బౌలింగ్ చేసి 24 పరుగులు ఇచ్చాడు, అతని ఎకానమీ రేట్ 8.00గా ఉంది. అర్ష్‌దీప్ సింగ్ విషయానికొస్తే, అతని గురించి %దీజజ×% ఎలాంటి అధికారిక అప్‌డేట్ ఇవ్వలేదు. ఎడమచేతి వాటం పేసర్ స్వల్ప ఫిట్‌నెస్ సమస్యతో బాధపడుతున్నట్లు సమాచారం. అడిలైడ్‌లో జరిగిన మ్యాచ్‌లో అతను కొంచెం ఇబ్బంది పడ్డాడు. మెడికల్ స్టాఫ్ వచ్చి గ్రౌండ్ లోకి వచ్చి చెక్ చేసి వెళ్లడం తెలిసిందే.. టీ20 వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా జట్టు సన్నద్ధమవుతోంది. టీ20 ఫార్మాట్లో నెంబర్ 1 జట్టు అయిన ఇండియాతో తలపడుతున్నాం. అందుకే ఈ సిరీస్ లో గట్టి పోటీ తప్పదు. టాస్ గెలిస్తే కచ్చితంగా ఫస్ట్ బౌలింగ్ చేయాలనుకున్నాం అని ఆసీస్ తాత్కాలిక కెప్టెన్ మిచెల్ మార్ష్ తెలిపాడు. ఆస్ట్రేలియా): మిచెల్ మార్ష్ (సి), ట్రావిస్ హెడ్, మాథ్యూ షార్ట్, మాట్ రెన్షా, అలెక్స్ కారీ , కూపర్ కానోలీ, మిచెల్ ఓవెన్, నాథన్ ఎల్లిస్, మిచెల్ స్టార్క్, ఆడమ్ జంపా, జోష్ హేజిల్‌వుడ్ భారత్: రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (సి), విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్, కెఎల్ రాహుల్ , వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.

# వర్షం కారణంగా మొదటి టీ20 రద్దు





సూర్యకుమార్, శుభ్‌మాన్ గిల్‌ల విధ్వంసం

కాన్‌బెర్రాలో వర్షం క్రికెట్ అభిమానుల ఆనందంపై నీళ్లు చల్లింది. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మొదటి టీ20 మ్యాచ్ రద్దు అయ్యేందుకు కారణమైంది. వర్షం కారణంగా, కేవలం 58 బంతులు మాత్రమే ఆడగలిగారు. ఈ సమయంలో, టీం ఇండియా ఒక వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ -శుభ్‌మాన్ గిల్ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. కానీ 10వ ఓవర్‌లో, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. వర్షం ఆగిపోవడానికి గంటన్నర పాటు వేచి ఉన్న తర్వాత కూడా ఆగలేదు. చివరకు చూసిన నిర్వాహకులు మ్యాచ్ రద్దు చేసినట్టు ప్రకటించారు. ఇప్పటికే వర్షం పడుతుందని భావించారు. మ్యాచ్ సకాలంలో ప్రారంభమైనప్పటికీ, ఆరో ఓవర్‌లో వర్షం వచ్చి దాదాపు అరగంట పాటు ఆటను నిలిపివేసింది. ఆ తర్వాత మ్యాచ్‌ను ఒక్కొక్కరికి 18 ఓవర్లకు కుదించారు. వర్షం తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభమైనప్పుడు, సూర్య, గిల్ దూకుడుగా బ్యాటింగ్ ప్రారంభించారు. ఇద్దరూ ఆస్ట్రేలియన్ బౌలర్లను పూర్తిగా దెబ్బతీశారు, కానీ అకస్మాత్తుగా, 10వ ఓవర్‌లో మళ్ళీ భారీ వర్షం మొదలైంది, మ్యాచ్ తిరిగి ప్రారంభం కాకుండా నిరోధించింది. వర్షం ప్రారంభమైనప్పుడు, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 24 బంతుల్లో 3 ఫోర్లు, రెండు సిక్సర్లతో 39 పరుగులు చేశాడు. శుభ్‌మాన్ గిల్ 20 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 37 పరుగులు చేశాడు. భారత్ కేవలం 9.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే, భారత బ్యాట్స్ మెన్ తన నిర్ణయం తప్పని నిరూపించుకున్నాడు. అభిషేక్ శర్మ 14 బంతుల్లో 19 పరుగులు చేసి నాలుగు ఫోర్లు బాదాడు. నాథన్ అలెన్ అభిషేక్ ను అవుట్ చేశాడు. సూర్యకుమార్ యాదవ్ 24 బంతుల్లో 39 పరుగులు చేశాడు, శుభ్‌మన్ గిల్ 20 బంతుల్లో అజేయంగా 37 పరుగులు చేశాడు. గిల్ నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ బాదగా, సూర్య మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. ఆస్ట్రేలియా తరఫున, జోష్ హాజిల్‌వుడ్ 3 ఓవర్లలో 24 పరుగులు ఇచ్చాడు. మాథ్యూ కున్హెమాన్ 2 ఓవర్లలో 22 పరుగులు, మార్కస్ స్టెయిన్స్ 1 ఓవర్లో 10 పరుగులు, నాథన్ ఎల్లిస్ 1.4 ఓవర్లలో 25 పరుగులు ఇచ్చాడు. జేవియర్ బార్ట్లెట్ 2 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టీ20లో భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రికార్డు నెలకొల్పాడు. ఈ విధ్వంసక బ్యాట్స్‌మన్ రెండు సిక్సర్లు కొట్టి, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 150 సిక్సర్లు కొట్టిన ప్రపంచంలో ఐదో ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ అగ్రస్థానంలో ఉన్నాడు, అతను ఫార్మాట్ నుంచి రిటైర్ అయ్యే ముందు 159 మ్యాచ్‌ల్లో 205 సిక్సర్లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో వచ్చిన సూర్యకుమార్ యాదవ్ తన దూకుడు విధానాన్ని కొనసాగించాడు. 10వ ఓవర్ మూడో బంతికి ఇన్నింగ్స్‌లో తన రెండో సిక్స్‌తో 150వ టీ20ఐ సిక్స్‌ను పూర్తి చేశాడు.

# పోరాడి ఓడిన టైటాన్స్

## క్వాలిఫయర్-2లోపుణెరి పల్టన్ విజయం



న్యూఢిల్లీ: ప్రో కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ కథ ముగిసింది. బుధవారం హోరాహోరీగా జరిగిన క్వాలిఫయర్-2లో టైటాన్స్ 45-50తో పుణెరి పల్టన్ చేతిలో పరాజయం పాలైంది. చివరి 3 నిమిషాల్లో స్టార్ రైడర్ ఆదిత్య షిండే ఐదు పాయింట్ల సూపర్ రైడ్‌తో మ్యాచ్‌ను పల్టన్‌వైపు తిప్పాడు. ఈ మ్యాచ్‌లో గెలిచిన పుణెరి పల్టన్ శుక్రవారం జరిగే టైటిల్ పోరులో దబాంగ్ ఢిల్లీతో తాడోపేడో తేల్చుకోనుంది. టైటాన్స్ ప్లేయర్ భరత్ 23 పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలిచినా జట్టును గెలిపించలేక పోయాడు. ఫస్టాఫ్ చివరికి టైటాన్స్ 24-20తో పైచేయిగా నిలిచింది.

# వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానానికి రోహిత్

## 38ఏళ్ల వయసులో వరల్డ్ రికార్డ్

- ఐసీసీ వన్డే క్రికెట్ ర్యాంకింగ్స్ విడుదల




ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తాజాగా వన్డే క్రికెట్ ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఇందులో భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సంచలనం సృష్టించాడు. ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత అతను వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో అతడు టీమ్‌ఇండియా టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానానికి చేరుకున్నాడు. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో కేవలం 8 పరుగులతో బ్యాట్స్‌మెన్‌గా వెనుదిరిగాడు రోహిత్ శర్మ. అయితే రెండో, మూడో మ్యాచ్‌ల్లో అద్భుతంగా రాణించాడు. 2వ వన్డేలో రోహిత్ శర్మ 73 పరుగులు చేయగా.. ముచ్చటగా మూడో వన్డేలో సెంచరీ చేయడమే కాకుండా 121 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. మొత్తం సిరీస్‌లో రోహిత్ శర్మ అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అతను 3 మ్యాచ్‌ల్లో 202 పరుగులు చేశాడు. శుభ్‌మాన్ గిల్ గతంలో ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే, ఇప్పుడు అతను మూడో స్థానానికి పడిపోయాడు. గిల్ 745 రేటింగ్ పాయింట్లతో ఉన్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రహీం జద్రాన్ 764 రేటింగ్ పాయింట్లతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత, రోహిత్ శర్మ రెండు స్థానాలు ఎగబాకి 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీకి అంతగా గుర్తుండిపోయేది కాదు. మూడో వన్డేలో అతను 74 పరుగులు చేసినప్పటికీ.. కోహ్లీ గతంలో వరుసగా రెండు వన్డేల్లో డకౌట్ అయ్యాడు. ఇది అతని ఐసీసీ ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. కోహ్లీ ఒక స్థానం దిగజారి టాప్-5 కంటే ఇంక దిగిపోయాడు. కోహ్లీ ప్రస్తుతం 745 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. రోహిత్, విరాట్ సుదీర్ఘ విరామం తర్వాత భారతదేశం తరపున ఆడుతున్నారు. ఇద్దరు అనుభవజ్ఞులు ఇప్పుడు దక్షిణాఫ్రికాతో జరిగే వన్డే సిరీస్‌లో ఆడుతున్నారు.

# అమ్మాయిలకు అగ్నిపరీక్ష

## నేడుఆస్ట్రేలియాతో భారత్ సెమీస్ వన్డే వరల్డ్ కప్

నవీ ముంబై: కొంచెం కష్టానికి మరికొంత అదృష్టం కలిసొచ్చి వరల్డ్ కప్‌లో సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టు ఇప్పుడిక అసలు సిసలు సవాలుకు సిద్ధమైంది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ సందర్భంగా డెర్బీలో జరిగిన 2017 ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియా జట్టుపైనే ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చేసిన అసామాన ప్రదర్శన గుర్తు చేసుకోవాలి. ఆ మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకు పడిన కౌర్ కేవలం 115 బంతులలో అజేయంగా 171 పరుగులు చేసి భారత్‌కు అపురూప విజయం అందించింది. మరి..ఈసారి సెమీఫైనల్లోనూ కౌర్ సారథ్యంలోని మన అమ్మాయిలు ఆ మ్యాచ్ ఫలితాన్ని పునరావృతం చేస్తారేమో చూడాలి. కానీ ఈసారి టోర్నీలో హర్మన్ సేన నిలకడైన ప్రదర్శన కనబర్చలేకపోయింది. వరుసగా మూడు పరాజయాలు చవిచూడడమే అందుకు ఉదాహరణ.

సెమీసకు ముందు కీలక బ్యాటర్ ప్రతీక రావల్ గాయంతో వైదొలగడం భారత్‌కు పెద్ద దెబ్బ. దాంతో దూకుడైన బ్యాటింగ్ చేసే షఫాలీ వర్మను ప్రతీక స్థానంలో తీసుకున్నారు. ఆస్ట్రేలియాపై ఒత్తిడి తెచ్చే ఉద్దేశంతో..మంధానతో కలిసి షఫాలీని ఓపెనింగ్ చేయిస్తారా? లేదంటే ఆరో బౌలర్‌కు చోటు కల్పించేందుకు హర్లీన్ డియోల్‌ను ఓపెనర్‌గా పంపుతారా.. అనేది చూడాలి. అలాగే..బంగ్లాదేశ్‌పై గత మ్యాచ్‌లో పదునైన బౌలింగ్‌తోపాటు చురుకైన ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్న స్పిన్నర్ రాధా యాదవ్‌ను కొనసాగిస్తారా అనేదీ ఆసక్తికరం. ఈ సారి టోర్నమెంట్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయిన కెప్టెన్ కౌర్..ఎనిమిదేళ్ల నాటి సెమీస్ ఇన్నింగ్స్ స్ఫూర్తిగా ఆస్ట్రేలియాపై మరోసారి విరుచుకు పడాలన్నది అభిమానుల ఆకాంక్ష. మరోవైపు ఇప్పటికే ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలతో సూపర్ ఫామ్‌లో ఉన్న మంధాన అదే జోరు కొనసాగించాల్సి ఉంటుంది. అయితే బౌలర్లు ధారాళంగా పరుగులిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనేపథ్యంలో పటిష్టమైన ఆస్ట్రేలియా బ్యాటర్లను నిలువరించాలంటే మన బౌలర్లు శక్తికి మించి సత్తా చాటాల్సిందే.



# సినిమాలకు సూపర్‌స్టార్ గుడ్ బై?.. కోలీవుడ్‌లో మళ్లీ హాట్ టాపిక్!



భారతీయ సినీ పరిశ్రమలో 'సూపర్‌స్టార్' అనే పదానికి చిరునామాగా నిలిచిన రజనీకాంత్ సినిమాల నుంచి తప్పుకోనున్నారా? ఆయన రిటైర్మెంట్‌పై కోలీవుడ్ వర్గాల్లో మరోసారి జోరుగా చర్చ జరుగుతోంది. 75 ఏళ్ల వయసులోనూ యువ హీరోలతో పోటీపడుతూ బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్న తలైవా, త్వరలోనే నటనకు స్వస్తి పలకనున్నారనే వార్తలు ఆయన అభిమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.ప్రస్తుతం రజినీకాంత్ 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'జైలర్ 2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా తర్వాత గతంలో 'అరుణాచలం' వంటి బ్లాక్‌బస్టర్ అందించిన దర్శకుడు సుందర్ సి దర్శకత్వంలో ఓ ప్రాజెక్టుకు అంగీకరించినట్లు సమాచారం. ఆ తర్వాత లోకనాయకుడు కమల్ హాసన్‌తో కలిసి, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించే భారీ మల్టీస్టారర్‌లో నటించనున్నారు. అయితే, ఈ చిత్రమే రజనీకాంత్ కెరీర్‌లో చివరి సినిమా కాబోతోందని తమిళ సినీ వర్గాల్లో గట్టిగా ప్రచారం జరుగుతోంది.ఇటీవల కాలంలో రజనీకాంత్ ఆధ్యాత్మికత వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. సినిమాల మధ్య విరామం దొరికినప్పుడల్లా హిమాలయాలకు వెళ్తుండటంతో ఆయన రిటైర్మెంట్ వార్తలకు మరింత బలం చేకూరుతోంది. అయితే, 'నా ఊపిరి ఉన్నంతవరకు నటిస్తూనే ఉంటాను' అని సూపర్‌స్టార్ గతంలో పలుమార్లు స్పష్టం చేశారు. గతంలోనూ ఇలాంటి వదంతులు వచ్చినప్పటికీ, అవన్నీ అవాస్తవాలని తేలిపోయాయి. అయినప్పటికీ, తాజా ప్రచారంతో ఈసారి ఆయన కచ్చితంగా రిటైర్మెంట్ నిర్ణయం తీసుకుంటారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఈ వార్తలతో ఆయన అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. "తలైవా లేకుండా తమిళ సినీ పరిశ్రమను ఊహించుకోలేం" అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. మరి ఈ వదంతులపై రజనీకాంత్ లేదా ఆయన ప్రతినిధులు స్పందిస్తారో, లేక ఎప్పటిలాగే మౌనంగా ఉంటారో వేచి చూడాలి

# చిరుతో సినిమా నా కల..

## మాళవిక మోహనన్



మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో రాబోతున్న 'మెగా 158' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి మాళవిక మోహనన్ స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ వదంతులేనని ఆమె తేల్చిచెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు."మెగా 158 చిత్రంలో నేను నటిస్తున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం జరుగుతోంది. ఐకానిక్ స్టార్ చిరంజీవి గారితో ఏదో ఒక రోజు స్క్రీన్ పంచుకోవాలనే కోరిక నాకు బలంగా ఉంది. కానీ, ప్రస్తుతానికి నేను ఆ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. దయచేసి ఆ వదంతులను నమ్మవద్దు" అని మాళవిక తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆమె ప్రకటనతో చిరంజీవి సరసన నటించబోయే హీరోయిన్‌పై గత కొద్ది రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో 'మెగా 158'పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. మాళవిక స్పష్టత ఇవ్వడంతో ఈ చిత్రంలో నటించబోయే అసలు కథానాయిక ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనిపై చిత్ర బృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# తీర ప్రాంతంలో రౌడీ-రాణీ మధ్య రొమాన్స్!



విజయ్ దేవరకొండ, కీర్తి సురేష్ జంటగా రవి కిరణ్ కోలా దర్శకత్వంలో రౌడీజనార్దన్ తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతుంది. ప్రేమ, రాజకీయం అంశాలను ఆధారంగా చేసుకుని అల్లిన స్క్రిప్ట్ ఇది. ఇందులో విజయ్ పాత్ర మాస్ కోణంలో ఉంటుందని..హీరో పాత్రకు ధీటుగా హీరోయిన్ రష్మిక పాత్ర కూడా ఉంటుందని ప్రచారంలో ఉంది. జనార్దన్ పాత్ర రౌడీ తరహాలో ఉంటే? రౌడీ రాణిలా కీర్తి పాత్ర ఉంటుందని వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి షూటింగ్ అప్ డేట్ తెరపైకి వచ్చింది. రొమాన్స్ పీక్స్ లో ఉంటుందా: ప్రస్తుతం మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఓ తీర ప్రాంతంలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇదే సినిమాకు సంబంధించిన తొలి షెడ్యూల్ గా వినిపిస్తోంది. దీనిలో భాగంగా విజయ్-కీర్తి సురేష్ లపై రొమాంటిక్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. రొమాన్స్ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయంటున్నారు. ఇద్దరి మధ్య రొమాంటిక్ సన్నివేశాలు రెగ్యులర్ రొమాన్స్ కు భిన్నంగా ఉంటాయని చెబుతున్నారు. రొమాంటిక్ సన్నివేశాలు విజయ్ దేరకొండకు కొత్తేం కాదు. ఇప్పటి వరకూ నటించిన చాలా సన్నివేశాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో తనదైన మార్క్ వేసాడు. రొమాంటిక్ భామగా కనెక్ట్ అవుతుందా: అర్జున్ రెడ్డి%-, -%గీతగోవిందం%-, -%డియర్ కామ్రేడ్ సహా చాలా చిత్రాల్లో తనదైన మార్క్ వేసాడు. కానీ కీర్తి సురేష్ మాత్రం రొమాంటిక్ హీరోయిన్ గా ఇంతవరకూ హైలైట్ కాలేదు. తొలి నుంచి అమ్మడు డీసెంట్ పాత్రలు పోషించుకుంటూ వచ్చింది. హీరోలతో రొమాంటిక్ సన్నివేశాలున్న సినిమాలకు దూరమైంది. ఆ రకంగా చాలా అవకాశాలు కూడా కోల్పోయింది. హీరోయిన్ల రేసులో వెనుకబాటుకు కారణం కూడా అదే. కానీ సర్కారు వారి పాట నుంచి కీర్తి కూడా పంథా మార్చింది. గ్లామర్ బ్యూటీ గాహైలైట్ అయ్యే ప్రయత్నాలు మొదలు పెట్టింది. కానీ ఆ తర్వాత ఆ రకంగా తనను ప్రూవ్ చేసుకునే అవకాశాలు రాలేదు. రెట్టింపు క్రేజ్ తథ్యం: దసరా లో మాస్ పాత్ర పోషించినా? అందులో రొమాంటిక్ యాంగిల్ హైలైట్ కాదు. భోళా శంకర్ లో సిస్టర్ పాత్రకే పరిమితమైంది. బాలీవుడ్ సినిమా బేబి జాన్ లో అటెంప్ట్ చేసింది. కానీ అది హిందీ సినిమా కావడంతో తెలుగు వరకూ చేరలేదు. ఈ నేపథ్యంలో రౌడీ జనార్దన్ రూపంలో రొమాంటిక్ భామగా ప్రూవ్ చేసుకునే అవకాశం వచ్చింది. వివాహ బంధంలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో నటిస్తోన్న తొలి రొమాంటిక్ చిత్రం కూడా ఇదే అవుతుంది. కీర్తి సురేష్ రొమాంటిక్ రోల్స్ తో యువతకు కనెక్ట్ అయితే అమ్మడి క్రేజ్ రెట్టింపు అవుతుందదనంలో ఎలాంటి సందేహం లేదు.



# ఒకేరోజు రెండు బ్లాక్ బస్టర్ సినిమాలు ఓటీటీలో!

ఒకే రోజున రెండు బ్లాక్ బస్టర్ సినిమాలు ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి రావడానికి సిద్ధమయ్యాయి. ఒకటి రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటించిన 'కాంతార చాప్టర్ -1' అయితే, మరొకటి కల్యాణి ప్రియదర్శన్ ప్రధానమైన పాత్రను పోషించిన 'లోకా -చాప్టర్ 1: చంద్ర'. ఒకటి 800 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టిన కన్నడ సినిమా అయితే, మరొకటి 300 కోట్లకి పైగా కొల్లగొట్టిన మలయాళ మూవీ. ఈ రెండు సినిమాలు ఈ నెల 31వ తేదీ నుంచి ఓటీటీ ప్రేక్షకులను పలకరించనున్నాయి.'కాంతార చాప్టర్ -1' సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వారు దక్కించుకున్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి ఈ సినిమాను కన్నడతో పాటు, తెలుగు .. తమిళ .. మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నారు. 'కాంతార' అడవులను ఆక్రమించడానికీ .. అక్కడి గిరిజనులను అణగదొక్కడానికి ఒక రాజు ప్రయత్నిస్తాడు. అడవినీ .. తనవారిని కాపాడుకోవడానికి ఆ నాయకుడు ఏం చేశాడు? అనేదే కథ. ఇప్పటికీ థియేటర్స్ లో ఆడుతున్న ఈసినిమా ఓటీటీ కి వస్తుండటం విశేషం. ఇక 'లోకా -చాప్టర్ 1: చంద్ర' విషయానికి వస్తే, దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమాకి డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమాలో చంద్ర అనే పాత్రలో కల్యాణి ప్రియదర్శన్ నటించింది. అతీంద్రియ శక్తులను దాచిపెట్టి ఒక సామాన్య యువతిగా రోజులు గడుపుతూ ఉంటుంది. చంద్రపై మనసు పారేసుకున్న సన్నీ, ఆమెకి అతీంద్రియ శక్తులు ఉన్నాయని తెలుసుకుంటాడు. ఫలితంగా ఏం జరుగుతుందనేది కథ. ఇక ఇదే రోజున 'జీ 5'లో 'మారిగల్లు' అనే కన్నడ సిరీస్ స్ట్రీమింగ్ కి రానుంది.







# గ్లోబల్‌గా ఇదిపవర్ స్టార్‌స్టామినా..!

పవన్ కళ్యాణ్ హీరోగా సాహో సుజీత్ దర్శకత్వంలో వచ్చిన ఓజీ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. రెగ్యులర్ సినీ ప్రేక్షకులు పెదవి విరిచినా, పవన్ కళ్యాణ్ వీరాభిమానులు మాత్రం ఓజీ సినిమాను నెత్తిన ఎత్తుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రెండు వారాల పాటు ఓజీ ఫీవర్ ఓ రేంజ్ లో ఊపేసిన విషయం తెల్సిందే. ఓజీ సినిమాను కేవలం ఫ్యాన్స్ కోసమే అన్నట్లుగా దర్శకుడు సుజీత్ రూపొందించిన తీరు, దానికి తమన్ అందించిన సంగీతం మరో లెవల్ అన్నట్లుగా చెప్పుకోవచ్చు. తమన్ ప్రతి సీన్‌కు ఇచ్చిన ఎలివేషన్ చూసి చాలా మంది షాక్ అయ్యారు. పవన్ ఫ్యాన్స్ ను ఇప్పటి వరకు ఈ స్థాయిలో ఊపేసింది ఎవరూ లేరు అంటూ తమన్, సుజీత్ గురించి సోషల్ మీడియాలో ప్రముఖంగా చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఓజీ ఓటీటీలో సందడి చేస్తోంది. పవన్ కళ్యాణ్ ఓజీ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్... ప్రముఖ ఓటీటీ నెట్‌ఫ్లిక్స్‌లో ఓజీ సినిమా స్ట్రీమింగ్ ఇప్పటికే మొదలైంది. థియేట్రికల్ రిలీజ్ అయిన నాలుగు వారాల తర్వాత ఈ సినిమాను ఓటీటీలో నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్ మొదలు పెట్టింది. థియేట్రికల్ రిలీజ్ సమయంలో చూసిన ప్రేక్షకులు, చూడని ప్రేక్షకులు అంతా కూడా నెట్‌ఫ్లిక్స్ లో ఓజీ ని తెగ స్ట్రీమింగ్ చేయడం ఖాయం అని మొదటి నుంచే అంతా అనుకున్నారు. అనుకున్నట్లుగానే ఓటీటీ లో ఓజీ సినిమాకు అద్భుతమైన స్పందన దక్కింది. నెట్‌ఫ్లిక్స్ ఇచ్చిన స్టాట్స్ ప్రకారం 23 అక్టోబర్ నుంచి 26 అక్టోబర్ వరకు ఏకంగా 3.2 మిలియన్‌ల వ్యూస్ ఓజీ సినిమా సొంతం చేసుకుంది. కేవలం నాలుగు రోజుల్లో ఈ స్థాయి వ్యూస్ రాబట్టడం ద్వారా పలు సినిమాల ఆల్ టైమ్ వ్యూస్ ను ఈ సినిమా క్రాస్ చేసిందని ఓటీటీ విశ్లేషకులు, సోషల్ మీడియాలో నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.